www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 12-6-2024 | పేజీలు: 14 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 163 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 7.17 తదుపరి సప్తమి; నక్షత్రం: మఖ రా. 2.12 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ. 12.55-2.41; దుర్ముహూర్తం: ఉ. 11.49-12.41; అమృతఘడియలు: రా. 11.32-1.19; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru







SCHOLARSHIP ALERT

FAEA Scholarship

Description: FAEA Scholarship 2024-25 is an opportunity offered by the Foundation for Academic Excellence and Access (FAEA) to Class 12 passed or first-year undergraduate students pursuing degrees in Arts, Commerce, Science, Engineering, or other technical and professional fields at any Indian institution.

Eligibility: Open for Class 12 students or first -year undergraduate students enrolled in a program offered by a recognized university, institution, or college in India, in fields including Arts, Commerce, Science, Medical, Engineering, or other technical or professional disciplines. Applicants must belong to a so cially and economically disadvantaged community, categorised as SC, ST, OBC, or BPL.

Prizes & Rewards: Tuition fees, maintenance allowance or hostel/mess charges and other allowances

Last Date to Apply: 30-06-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/FAEA2

NextGen Edu Scholarship



Description: Buddy4Study in collaboration with EY Global Delivery Services is inviting applications through NextGen Edu Scholarship 2024-25 - a social impact initiative. Class 11 students enrolled in private or government schools across India are eligible to receive financial support for their studies.

Eligibility: Students studying in Class 11 at any private/government school across India are eligible to apply. Applicants must have secured a minimum of 60% in their Class 10. They must have an annual family income up to INR 3 lakh from all sources.

Prizes & Rewards: Scholarship of INR 15,000

Last Date to Apply: 26-06-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/EYGDS1

Eternal University's Scholarship Aspiring Young Women 2024-27

Description: Eternal University in collaboration with NavGrurkul and Sri Badrika Ashram, invi tes applications for its BCA program from Class 12 passed female students domiciled in Himachal Pradesh, Punjab, and neighbouring states.

Eligibility: Open for female Indian nationals between the ages of 16 and 28 years. Applicants must be domiciled in Punjab, Himachal Pradesh, or neighbouring areas, and have passed Class 12 from a recognised institution. Students must be willing to pursue a BCA program at the university and have an annual family income of not more than 6 lakhs.

Prizes & Rewards: A waiver of 3.25 lakhs towards tuition fees, accommodation, food, and a laptop for the course duration.

Last Date to Apply: 30-06-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/BCAY1

buddy4study.com

దిక్సూచి DIKSUCHI


కోర్ బ్రాంచెస్‌లో కీలకం మెకానికల్ ఇంజనీరింగ్

యాంత్రీకరణతో కలిగిన ప్రయోజనాలు ఎన్నో. మానవ నాగరికతలో అది చెప్పుకోదగ్గ మైలురాయి. యంత్రం ఎలా పనిచేస్తుందో తెలియాలంటే మెకానికల్ ఇంజనీరింగ్‌పై అవగాహన ఉండాలి. ఈ డిసిప్లిన్‌పై అవగాహనకు తోడు అధ్యయనంతో వచ్చే ఉద్యోగాలు, కెరీర్ పరంగా ఎదుగుదల ఎలా ఉంటుందో చూద్దాం.

కదలిక ఉన్న పరికరాల డిజైన్, అభివృద్ధి, ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు సహా సమస్తం మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి వస్తాయి. మానవుడి రోజువారి జీవితంతో ఈ సబ్జెక్టుకు విడదీయరాని అనుబంధం ఉంది. నివశిస్తున్న భవనంతో మొదలుకుని డ్రైవ్ చేసే వాహనం వరకు చాలా వాటిని మెకానికల్ ఇంజనీరింగ్ ఉనికికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ప్రాబ్లమ్ సాల్వింగ్ కూడా ఇందులో భాగం. సైన్స్, మేథ్స్ ఉపయోగించి మెకానికల్ ఇంజనీర్లు పలు సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటారు. గతాన్ని ఆధారం చేసుకుని మరింత మెరుగైన యంత్రాలను కూడా సూచిస్తారు. టెక్నాలజీతో వచ్చిన అడ్వాన్స్‌మెంట్ ఫలితంగా వివిధ ప్రక్రియల మెరుగుదలకు తోడు సమస్యలకు మంచి పరిష్కారం చూపగలుగుతారు. అందుకే మెకానికల్ ఇంజనీర్లు బయోమెడికల్, మాన్యుఫాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, ఆటోమేటివ్ రంగాల్లో ఉపాధిని పొందగలుగుతున్నారు. మెడికల్ డివైజ్‌లు, ఎలివేటర్లు, ఇంజన్లు తదితరాలన్నింటిలో మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్ పనులు సక్రమంగా నిర్వహించగలుగుతున్నారు.

వివిధ బ్రాంచ్‌లు

మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి పలు బ్రాంచీలు వస్తాయి. ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమేషన్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, ఆటోమొబైల్ మెయింట్‌నెన్స్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఆటోమేటివ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, మెకానికల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్(ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్), మెకానికల్ అండ్ రైల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్(ఆటోమొబైల్), మెకానికల్ ఇంజనీరింగ్(ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ ఇంజనీరింగ్(మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్), మెకానికల్ ఇంజనీరింగ్(ప్రొడక్షన్), మెకానికల్ ఇంజనీరింగ్(వెల్డింగ్ టెక్నాలజీ), మెకానికల్ ఇంజనీరింగ్ ఆటోమొబైల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిజైన్, మెకట్రానిక్స్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఆటోమేటివ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఆటోమొబైల్ సర్వీసింగ్ వంటివన్నీ మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకే వస్తాయి.



కౌన్సెలింగ్ గైడెన్స్

కెరీర్ అవకాశాలు

పలు కంపెనీలు వీరికి జాబ్స్ ఇస్తున్నాయి. గోద్రేజ్, మహీంద్రా అండ్ మహీంద్రా, లారెన్స్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టి), కిర్లోస్కర్, థెర్మాక్స్, అశోక్ లేలాండ్, బీహెచ్ఈఎల్, ఇస్రో, కోల్ వంటి టాప్ పర్ఫార్మింగ్ కంపెనీలు వీరికి ఇచ్చే జాబ్స్ చాలా ఉపయోగకరంగా, వృత్తిలో ఎదిగేందుకు వీలు కల్పించే విధంగా ఉంటాయి. నిజానికి అకడమిక్ గ్యాప్‌ని పూరించేందుకు బీటెక్ కోర్సు తోడ్పడుతుంది. నైపుణ్యం, జాబ్‌లో ఇంప్రూవ్‌మెంట్‌కు అవసరపడుతుంది. అందుకే చదువుతున్నప్పుడే ఇండస్ట్రియల్ ఎక్స్‌పోజర్ చాలా అవసరం. లోతైన అవగాహన కోసం పీజీ చేస్తే ఇంకా మంచిది. మెకానికల్ ఇంజనీరింగ్‌లో లెక్కలేనన్ని అవకాశాలు ఎదురు చూస్తూ ఉంటాయి. సంబంధిత అవగాహన, నైపుణ్యాలను అనుసరించి విలక్షణమైన జాబ్స్‌ను పొందవచ్చు.

కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్: పెద్ద పెద్ద నిర్మాణాల్లో మరొక భవన నిర్మాణంలోనూ మెకానికల్ ఇంజనీర్ అవసరం ఉంటుంది. వెంటిలేషన్, కూలింగ్, హీటింగ్ వంటి పనులు అక్కడ ఉండే వారికి ఎలాంటి అపాయం కలుగని రీతిలో ఉండేందుకు మెకానికల్ ఇంజనీర్ల సూచనలు, సలహాలు అవసరమవుతాయి.

ఆటోమేటివ్ ఇంజనీర్: ఆటోమోటివ్ ఇండస్ట్రీలో వివిధ వాహనాల ఉత్పత్తి, డిజైనింగ్‌లో వీరి సేవలు అవసరమవుతాయి. ఇందులో మళ్లీ కస్టమర్, మిలిటరీ వాహనాలంటూ ప్రత్యేకంగానూ ఉంటాయి. సురక్షితంగా కొత్త ఫీచర్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఏరోడైనమిక్స్ తదితరాల్లో మెకానికల్ ఇంజనీర్ల పాత్ర ఉంటుంది.

రోబోటిక్ ఇంజనీర్: రోబోటిక్స్ నిర్మాణం, ప్లాన్, నిర్వహణలో పాలుపంచుకోవాలి. డిజైన్, టెక్నాలజీకి తోడు హెల్త్‌కేర్, మెడికల్ డివైజ్‌ల కోసం రోబోట్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

ప్రాసెస్ ఇంజనీర్: తార్కికంగా ఆలోచించడం, సరికొత్తగా చేయాలన్న ఆలోచన - అమలుపై ఆసక్తి ఉన్న మెకానికల్ ఇంజనీర్లు బీటెక్ తరవాత ప్రాసెస్ ఇంజనీరింగ్‌ను ఎంచుకోవాలి. సంబంధిత విధానాల మెరుగుదలలో ప్రాసెస్ ఇంజనీర్ల పాత్ర ఇతోధికంగా ఉంటుంది. వాటర్ అండ్ పవర్ సప్లయ్, ఫార్మాస్యూటికల్స్, డ్రగ్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలో వీరి అవసరం చాలా ఉంటుంది.

మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్: వస్తువుల ఉత్పత్తికి అవసరమైన మెషీన్ల డిజైనింగ్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్ పరిధిలోకి వస్తుంది. మెషీన్ విభాగాలు వేటినైనా వీరే రూపొందిస్తారు. అప్లయిన్సెస్ నుంచి ఫుడ్ వరకు వాటికి అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

ప్రాజెక్ట్ మేనేజర్: వివిధ పనులను ప్రాజెక్టులుగా మలిచి టీమ్‌లను సదరు సంస్థలు నియమిస్తాయి. వారందరితో సక్రమంగా పనిచేయిస్తేనే సదరు ప్రాజెక్ట్ పని పూర్తవుతుంది. ప్రాజెక్టుకు మేనేజర్‌గా అనుభవం బాగా ఉన్న వ్యక్తులను నియమిస్తారు. తమ టీమ్‌లోని సభ్యులతో సమర్థంగా పనిచేయించడమే కాదు, ఫలితాలను రాబట్టే పనిని వీరు చేయాల్సి ఉంటుంది. ఇందులోనూ ఎక్స్‌పీరియెన్స్‌డ్ మెకానికల్ ఇంజనీర్లు నేతృత్వం వహిస్తారు.

సర్వీస్ అండ్ మెయింట్‌నెన్స్ ఇంజనీర్: కస్టమర్ బిల్డింగ్‌లో వీరుంటారు. యంత్రాలు సమర్థంగా, నిరంతరాయంగా పనిచేసే విషయంలో నిమగ్నమై ఉంటారు. క్లయింట్ విజిట్స్, మెషీన్ల చెకింగ్, పనికిరాని వాటిని తొలగించి కొత్తవాటిని ఉంచడం వంటి పనులు ఉంటాయి.

మెటీరియల్స్ ఇంజనీర్: వివిధ యంత్రాల ఉత్పత్తిలో మెటీరియల్ సేకరణ, పరీక్షించడం, మోడిఫై, ఎవాల్యుయేషన్ పనులు ఉంటాయి.

కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: ఫ్యాక్టరీ లేదంటే పనిచేసే చోట పరిశోధన, డిజైన్, డెవలప్‌మెంట్, సిస్టమ్స్ ఇన్‌స్టలేషన్ పనులు ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే.

ప్రొఫెసర్స్, లెక్చరర్స్: మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ లేదంటే యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ ఎగ్జామ్‌లో క్వాలిఫై అయితే ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో బోధకులుగా రాణించవచ్చు. అంటే అకడమిక్ వాతావరణంలో ఉండొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు: యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ రాసి ఎంపికైతే ఆరంభంలోనే మంచి జీతం, అధికారిక హోదా తద్వారా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను నిర్మించుకోవచ్చు. ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థలు మొదలుకుని పలు ఇతర విభాగాల్లో మెకానికల్ ఇంజనీర్లు అవసరమవుతారు.

ఆంత్రప్రెన్యూర్‌షిప్: బాస్‌గా మారడం అన్నమాట. సొంతంగా పైకి ఎదగాలన్న ఆకాంక్ష ఉంటే అందుకు సొంత ఆలోచనలు తోడైతే ఇండిపెండెంట్‌గా యూనిట్ పెట్టుకోవచ్చు. ఒకరి కింద పనిచేయాల్సిన అవసరం ఉండదు. తానే మరికొందరికి ఉపాధి కల్పించవచ్చు.

ప్రయోజనాలు

మనిషి దైనందిన జీవితంతో ముడిపడినది మెకానికల్ ఇంజనీరింగ్. అందులో భాగంగా వివిధ పరిశ్రమల్లో తలెత్తే సమస్యల పరిష్కారంలో మెకానికల్ ఇంజనీర్లు విశిష్ట పాత్రను పోషిస్తారు. మెషీన్స్‌కు సంబంధించి మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్, మెయింట్‌నెన్స్, అనాలిసిస్ కాన్సెప్టులు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులో భాగం. ఈ నాలుగేళ్ళ కోర్సు మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉజ్వల కెరీర్‌కు రహదారిని నిర్మిస్తుంది. మేథ్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, థియరీ ఆఫ్ మెకానిక్స్, మెషీన్ డ్రాయింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ తదితరాలు కోర్సులో ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్, రీసెర్చ్, డిజైన్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించి నైపుణ్యాల పెంపునకు పై అంశాల అధ్యయనం ఉపయోగపడుతుంది. సంబంధిత నైపుణ్యాలకు పదునుపెట్టుకోవడం ద్వారా మాత్రమే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం లభిస్తుంది. వివిధ ఉత్పత్తులకు అవసరమైన యంత్రాల నిర్మాణం, మెరుగుదలలోనూ పాత్ర ఉంటుంది. మొత్తమ్మీద యంత్ర పురోగతితో మానవాభివృద్ధి ముడిపడి ఉందన్న అవగాహన ఉంటే సమాజంలో మెకానికల్ ఇంజనీర్ల అవసరం ఎంత అన్నది అర్థమవుతుంది. అవకాశాలకు ఆకాశమే హద్దు అన్న విషయమూ అవగతమవుతుంది.




ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రశ్నలు 'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0hymA9Rలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

రాయన్ రాక ఖాయం



హీరో ఇమేజ్‌ను పక్కనపెట్టి ఎలాంటి పాత్రలో అయినా ఇట్టే ఇమిడిపోయే నటనా చాతుర్యం ధనుశ్ సొంతం. తమిళ చిత్రాలతో మొదలైన ఆయన నట ప్రస్థానం హాలీవుడ్ దాకా చేరింది. కోట్లాది మంది అభిమానుల ఆదరణ సొంతం చేసుకుంది. 'ఇంత సాధించాం ఇక చాల్లే' అనుకోకుండా, ఎప్పటికప్పుడు కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఆయన త్వరలో తన 50వ చిత్రం 'రాయన్'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ సినిమాను ధనుశ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. సందీప్ కిషన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సన్‌పిక్చర్స్ నిర్మిస్తోంది. మేకర్స్ మంగళవారం రిలీజ్‌డేట్‌ను ప్రకటించారు. జూలై 26న 'రాయన్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ధనుష్ శక్తిమంతమైన లుక్‌లో కనిపించారు. కాళిదాస్ జయరామ్, ఎస్.జె సూర్య, సెల్వ రాఘవన్, అపర్ణ బాలమురళి, దుషార విజయన్ ప్రధాన తారాగణం. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాశ్. ఎడిటర్: ప్రసన్న జికె

రవితేజ 75వ సినిమా!

స్వయంకృషితో స్టార్ ఎదిగిన నటుడు రవితేజ. కామెడీ టైమింగ్‌లో, విలక్షణమైన డైలాగ్ డెలివరీతో ఆడియన్స్‌ను ఆకట్టుకొన్న ఆయన కొత్త చిత్రం మంగళవారం ప్రారంభమైంది. ఇది ఆయనకు 75వ సినిమా కావడం విశేషం.



సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న శ్రీలీల క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించడం విశేషం. ఈ చిత్రంతో రచయిత భాను బోగవరపు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య' చిత్రానికి మాటల రచయితగా, 'సామజవరగమన' సినిమాకు స్క్రీన్‌ప్లే రచయితగా పని చేసి మంచి గుర్తింపు పొందిన భాను బోగవరపు ప్రస్తుతం బాలకృష్ణ నటిస్తున్న 109వ చిత్రానికి మాటలు రాస్తున్నారు. ఆ చిత్రం నిర్మాణంలో ఉండగానే ఆయనకు దర్శకుడిగా అవకాశం రావడం గమనార్హం. పలు విజయవంతమైన చిత్రాలను నిర్మిస్తున్న సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వినోదంతో కూడిన పూర్తి మాస్ పాత్రలో రవితేజను చూడాలని కోరుకుంటున్న ఆయన అభిమానులకు ఈ సినిమా ఫుల్ జోష్ ఇస్తుందని దర్శకనిర్మాతలు వెల్లడించారు. మంగళవారం నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: నందు సవిరిగాన, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న, సమర్పణ: శ్రీకర్ స్టూడియోస్.

సీనియర్ నటుడు అర్జున్ కుమార్తె వివాహం

సీనియర్ నటుడు అర్జున్ కుమార్తె ఐశ్వర్య వివాహం సోమవారం రాత్రి చెన్నైలో జరిగింది. అర్జున్ నిర్మించిన యోగాంజనేయస్వామి దేవాలయంలోనే ఈ పెళ్లి సంప్రదాయబద్ధంగా జరిగింది. తమిళ హాస్యనటుడు తంబి రామయ్య కుమారుడు ఉమాపతి పెళ్లి కొడుకు. కొన్ని తమిళ చిత్రాల్లో హీరోగా నటించారు. ఈ పెళ్లికి విశాల్, కార్తి, సముద్రఖని, కె.ఎస్.రవికుమార్, ఎస్.ఆర్.ప్రభు, విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.



యేవమ్ అందరికీ మంచి బ్రేక్ ఇస్తుంది



చాందిని చౌదరి, వశిష్ఠ సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి నవదీప్, గోపరాజు నిర్మాతలు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ "నేను బాగా గౌరవం ఇచ్చే కోస్టార్స్‌లో చాందిని ఒకరు. పలువురు మహిళలు ఉన్న ఈ సినిమా టీమ్‌ను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. అందరికీ ఈ చిత్రం మంచి బ్రేక్‌నిస్తుంది" అని అన్నారు. డైరెక్టర్ సందీప్ రాజ్ మాట్లాడుతూ "ఇదొక డిఫరెంట్ థ్రిల్లర్. ఇంటర్వెల్, పతాక సన్నివేశాలు ఊహించని విధంగా ఉంటాయి" అని చెప్పారు. "మనసుపెట్టి, నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా" అని నిర్మాత నవదీప్ అన్నారు. చిత్ర దర్శకుడు ప్రకాశ్ దంతులూరి మాట్లాడుతూ "ఆసక్తికరంగా ఉండే వినోదాత్మక థ్రిల్లర్ 'యేవమ్'" అని చెప్పారు. చాందినీ చౌదరి మాట్లాడుతూ "ఇందులో నాది పోలీస్ పాత్ర అనగానే యాక్షన్ ఓరియెంటెడ్‌గా ఉంటుందని అనుకున్నాను. అయితే యాక్షన్‌తో పాటు అన్ని షేడ్స్ నా పాత్రలో ఉన్నాయి" అని చెప్పారు.

క్లైమాక్స్ గుర్తుండిపోతుంది



'సెహరి' సినిమాతో దర్శకుడిగా తొలి చిత్రంతోనే ప్రేక్షకుల దగ్గర మంచి మార్కులు కొట్టేశారు జ్ఞానసాగర్ ద్వారక. ఆయన దర్శకత్వం వహించిన రెండో సినిమా 'హరోం హర'. సుధీర్‌బాబు నటించిన ఈ చిత్రాన్ని సుమంత్.జి.నాయుడు నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక మీడియాతో ముచ్చటించారు. "యాక్షన్ సినిమాలు చేయడమంటే నాకు చాలా ఇష్టం. 'హరోంహర' ఒక న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా. 1990ల నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ చిత్రంలో చాలా మాస్ ఎలిమెంట్స్, ఎలివేషన్స్ ఉంటాయి. వాస్తవిక సంఘటనల ఆధారంగా ఈ కథను రాసుకున్నాను. ఇందులో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేసే కథానాయకుడు.. గన్ మేకింగ్ మొదలుపెట్టి పవర్‌ఫుల్ సుబ్రమణ్యంగా ఎలా మారాడన్నది సినిమా కథ. లవ్, యాక్షన్, ఎమోషన్, సెంటిమెంట్‌తో పాటు ఆధ్యాత్మిక అంశాలు కూడా ఉంటాయి. సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది. కుప్పం యాసలో ఆయన ఇరగదీశారు. సినిమాకు మ్యూజిక్, విజువల్స్ బాగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో చూస్తున్న ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తుంది. క్లైమాక్స్ అయితే ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని చెప్పారు.



రౌడీ రిలీజ్‌కు రెడీ



కేజీఎఫ్ ఫేమ్ యశ్ హీరోగా నటించిన ఓ కన్నడ చిత్రం 'రాజధాని రౌడీ' పేరుతో తెలుగులో విడుదలవుతోంది. షీనా కథానాయిక. కేవీ రాజు దర్శకుడు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలవుతోంది. సంతోష్ ఎంటర్టైన్‌మెంట్స్ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మాదక ద్రవ్యాలు, మద్యపానం బారినపడిన నలుగురు యువకులు తమ జీవితాలను ఎలా నాశనం చేసుకున్నారు అనే పాయింట్ చుట్టూ కథ సాగుతుంది. వినోదానికి చక్కటి సందేశాన్ని జోడించి తెరకెక్కించాం' అని తెలిపారు. 'ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్ పోలీస్ ఆఫీసర్‌గా కీలకపాత్రలో నటించారు. ముమైత్‌ఖాన్ పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉంటుంది' అని దర్శకుడు అన్నారు.

సీతాకోక చిలుకై ఎగిరింది



చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'నేను కీర్తన'. రిషిత, మేఘన కథానాయికలు. సీ లక్ష్మీకుమారి నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం నుంచి 'సీతాకోక చిలుకై ఎగిరింది మనసే' అంటూ సాగే యుగళ గీతాన్ని నిర్మాత సాయి రాజేశ్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ 'ఫస్ట్‌కాపీ సిద్ధమైంది. పాటలు, ఫైట్స్ మా చిత్రానికి ప్రత్యేకాకర్షణ. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/mv5nFAq లో చదవండి.

కన్నడ హీరో దర్శన్ అరెస్టు



ప్రియురాలి కోసం ఓ వ్యక్తిని హత్య చేయించారన్న ఆరోపణలతో ప్రముఖ కన్నడ హీరో దర్శన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నటి పవిత్ర గౌడతో దర్శన్ సన్నిహితంగా ఉండేవారు. ఈ నేపథ్యంలో పవిత్రకు అసభ్యకర సందేశాలు పంపిన రేణుకాస్వామి (33) దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్య కన్నడ ఇండస్ట్రీని కుదిపేసింది. దర్శన్ సూచనల మేరకే ఈ హత్య జరిగినట్టు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మైసూర్‌లో దర్శన్‌ను, ఆయన ప్రియురాలు పవిత్ర గౌడను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దీంతో ఇప్పటివరకు రేణుకాస్వామి హత్య కేసులో సంబంధం ఉన్న మొత్తం 13 మందిని అరెస్టు చేసినట్టు మంగళవారం ప్రకటించారు. రేణుకాస్వామి ఓ మెడికల్ షాపులో పనిచేసేవాడు. ఆయన ఇటీవల పవిత్రగౌడపై సోషల్ మీడియాలో అసభ్య సందేశాలు పోస్టు చేశారని ఆరోపణలున్నాయి. ఇదే విషయాన్ని ఆమె నటుడు దర్శన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చిత్రదుర్గలోని దర్శన్ అభిమాన సంఘం ముఖ్యుడు రాఘవేంద్రకు సమాచారం ఇచ్చి, రేణుకాస్వామిని బెంగళూరుకు రప్పించారు. కామాక్షిపాళ్యలోని దర్శన్ అనుచరుడికి చెందిన కారుషెడ్‌లో ఈ నెల 8న రేణుకాస్వామిపై దాడి చేసి చంపేశారు. పోలీసులు దర్యాప్తులో 11 మంది అనుమానితులను అరెస్టు చేశారు. వారు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ హత్యతో సంబంధం ఉన్న దర్శన్, పవిత్రలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పవిత్రగౌడ ఏ1 కాగా, దర్శన్ ఏ2గా ఉన్నారు. వారిని మంగళవారం సాయంత్రం 24వ ఏసీఎంఎం కోర్టు ముందు హాజరు పరిచారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం 12-6-2024
Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa| Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



విద్యుద్దీప వెలుగుల్లో కలెక్టరేట్ భవనం

ప్రజా ప్రభుత్వం కొలువుదీరుతున్న వేళ!

నెల్లూరు (ఆంధ్రజ్యోతి/హరనాథపురం), జూన్ 11 : అన్ని వర్గాల ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజు రానేవచ్చింది. కొన్ని గంటల్లో.. కాదు కాదు.. కొన్ని నిమిషాల్లో ప్రజా ప్రభుత్వం కొలువుదీరనుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్కులో ఈయనతోపాటు మంత్రులు కూడా ప్రమాణం చేయనున్నారు. ఈ బృహత్తర ఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు కూటమి శ్రేణులు, అభిమానులు భారీగా విజయవాడకు బయలుదేరి వెళ్లారు. అక్కడకు వెళ్లలేని వారి కోసం జిల్లావ్యాప్తంగా భారీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేసి లైవ్ ప్రదర్శన చేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ బుధవారం ఉదయం 11.27 గంటలకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు జిల్లావ్యాప్తంగా 12 ప్రదేశాల్లో ఎల్ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. అలాగే, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలను గన్నవరం తీసుకెళ్లేందుకు 32 బస్సులను ఏర్పాటు చేశారన్నారు. ఈ బస్సులు బుధవారం ఉదయానికల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటాయని తెలిపారు. అలాగే, ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేసినట్లు చెప్పారు. కాగా, కలెక్టరేట్‌తోపాటు నగరపాలక సంస్థ, డీసీఓ తదితర ప్రభుత్వ కార్యాలయాలు విద్యుద్దీపాలతో దగదగలాడుతున్నాయి.



నెల్లూరు : ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



విజయవాడకు బయలుదేరుతున్న అభిమానులు

● తరలిన తమ్ముళ్లు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి జిల్లా నుంచి తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. అన్ని నియోజకవర్గాల నుంచి బస్సులు, కార్లలో మంగళవారం రాత్రి బయల్దేరారు. ఇప్పటికే కొత్తగా ఎన్నికలైన ఎమ్మెల్యేలంతా విజయవాడలో ఉన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి రెండు బస్సులు మంగళవారం రాత్రి 10 గంటలకు మంగళగిరి బయలుదేరి వెళ్లాయి.

చెత్త పన్నుకు 'చెక్'

నెల్లూరు(సిటీ) : తమది సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకుంటూ పాలన సాగించిన జగన్ సర్కారు ప్రజల నుంచి అందినకాడికి దోచుకోవడమే ధ్యేయంగా పెట్టుకుంది. చెత్త మీద కూడా పన్ను విధిస్తూ దేశవ్యాప్తంగా విమర్శలను మూటకట్టుకున్న వైసీపీ ప్రభుత్వ నిర్ణయానికి తాజాగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు చెక్ పెట్టింది. చెత్త పన్ను పేరిట ఎలాంటి నగదు వసూలు చేయొద్దని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మౌఖికంగా ఆదేశాలు అందాయి. దీనిపై పట్టణ వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఉత్సాహంగా..

విజయవాడలో మంగళవారం జరిగిన ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో జిల్లాకు చెందిన శాసన సభ్యులూ పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్ర బాబు, లోకేష్‌లకు శుభాకాంక్షలు తెలిపి, ఇతర నేతలతో సరదాగా గడిపారు.



లోకేష్‌తో సోమిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న కందుకూరు, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల, కావ్య కృష్ణారెడ్డి



వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పొంగూరు నారాయణ



ఆనం, కోటంరెడ్డి, కురుగొండ్ల



మహిళా శాసనసభ్యులతో ప్రశాంతిరెడ్డి, విజయశ్రీ

వైసీపీ నేత.. తెల్లరాయి మేత!

- మైనింగ్, రెవెన్యూ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..
- మూడు ఎక్స్‌కవేటర్లు, ఓ ట్రాక్టర్ స్వాధీనం



ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

సైదాపురం, జూన్ 12 : తెల్లరాయి అక్రమ రవాణాలో వైసీపీ నాయకుడి బాగోతం వెలుగులోకి వచ్చింది. మంగళవారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు జరిపిన దాడుల్లో ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. తుమ్మలతలుపూరు పంచాయతీ పరిధిలోని కనక దుర్గ నివాసాల గృహాల వద్ద సోమవారం రాత్రి తెల్లరాయిని తరలిస్తున్న ఓ లారీ వేగంగా వెళుతూ ఆవును ఢీకొని, ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు వచ్చే వరకు అంటే మంగళవారం మధ్యాహ్నం వరకు ఆవు కళేబరాన్ని అక్కడే ఉంచారు. మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు తెల్లరాయి తవ్వుతున్న జయలక్ష్మి మైనింగ్‌ను పరిశీలించారు. మైన్ ఆవరణలోని ముళ్ల చెట్ల పొదల్లో దాచి ఉంచిన మూడు హిటాచీ మిషన్లను తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ కొనుగొన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌లకు అప్పగించారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న తిప్ప వద్ద తెల్లరాయి కోసం వెళ్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైసీపీ నేత వైవీ రామిరెడ్డికి రూ.114 కోట్ల పెనాల్టీ

నెల్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత వైవీ రామిరెడ్డికి భారీ జరిమానా విధిస్తూ మైనింగ్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. రాపూరు మండలంలోని తన లీజు ప్రాంతంలో పరిమితికి మించి తవ్వకాలు జరపడం, అనుమతుల్లేకుండా పక్క భూముల్లో కూడా మెటల్ క్వారీని తవ్వి విక్రయించడంతో మైనింగ్ అధికారులు చర్యలకు పూనుకున్నారు. 2022లోనే తొలిసారి సర్వే చేసిన అధికారులు నాడు రూ.39.13 కోట్ల పెనాల్టీ విధిస్తూ నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత కూడా రాపూరు మండలం పులిగిలపాడులో వైవీ రామిరెడ్డికి చెందిన ఎస్‌ఎల్‌వీ స్టోన్ క్రషర్స్ సంస్థ నిబంధనలను ఉల్లంఘించింది. తాజాగా మరోమారు మైనింగ్ శాఖ అధికారులు క్వారీల్లో తనిఖీలు నిర్వహించి మరో రూ.75.04 కోట్లు పెనాల్టీ విధిస్తూ షోకాజు నోటీసులు జారీ చేశారు. వైవీ రామిరెడ్డికి చెందిన ఎస్‌ఎల్‌వీ స్టోన్ క్రషర్స్ లీజుకు సంబంధించి అనధికార తవ్వకాలకుగానూ రూ.114.18 కోట్లు జరిమానా విధించారు.

నిర్లక్ష్యంతోనే టపాసుల గోదాములో మంటలు

- చికిత్స పొందుతూ బాలుడి మృతి : ఎస్‌ఐ



మృతుడు సురేష్ రేనా (ఫైల్)

బిట్రగుంట, జూన్ 11 : టపాసుల గోదాము నిర్వాహకులతో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే అగ్నిప్రమాదం సంభవించిందని బోగోలు ఎస్‌ఐ భోజ్య అన్నారు. బోగోలు మండలం కప్పరాళ్ళతిప్ప, ఇబ్రహీంపేట మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు సమీపంలో ఉన్న టపాసుల గోదాములో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పీట్ల సురేష్ రేనా (12) నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని కావలి డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ నాగభూషనంతో కలిసి తాను పరిశీలించినట్లు చెప్పారు. గోదాము నిర్వాహకుడు మాదినేని సుమంత్‌కు 2026 వరకు లైసెన్స్ ఉన్నట్లు చెప్పారు. అయితే రాత్రి సమయంలో విద్యుత్ మరమతు పనులు నిర్లక్ష్యంగా చేయించడం, గోదాములో 12 ఏళ్ల బాలుడితో పనిచేయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. అంతేగాక జాగ్రత్తలు పాటించకుండా సచివాలయ జేఎల్‌ఎం ప్రేమ్‌కుమార్ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రమాదం జరిగిందని అన్నారు. ఈ విషయమై ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం దుకాణాల్లో పాతవారినే నియమించుకోండి!

- లోకేష్‌ను కోరిన లిక్కర్ వర్కర్స్ అసోసియేషన్




లోకేష్‌ను కలిసిన కాట్ల సుధాకర్

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 11 : తెలుగుదేశం ప్రభుత్వ హయంలో మద్యం దుకాణాల్లో పని చేసిన వారిని తిరిగి నియమించుకోవాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను రాష్ట్ర లిక్కర్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాట్ల సుధాకర్ కోరారు. మండలంలోని చెల్లాయపాళెంకు చెందిన సుధాకర్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల అధ్యక్షులతో కలిసి సోమవారం రాత్రి ఉండవల్లిలో లోకేష్‌ను కలిశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మద్యం దుకాణాలలో క్యాషియర్లు, అటెండర్లు, బాయ్స్‌గా పనిచేసిన 60వేలు మందిని వైసీపీ ప్రభుత్వం తొలగించి ఆ పార్టీకి చెందిన వారిని నియమించుకుందని వివరించారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చినందున పాతవారినే తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన లోకేష్ వారం తరువాత మరోసారి తనను కలవమని చెప్పినట్లు సుధాకర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఏఎస్‌పేట, జూన్ 11: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం ఏఎస్‌పేటలో చోటు చేసుకుంది. వివరాల మేరకు గంగవరపు అశోక్ (21) అనే యువకుడు సెంట్రింగ్ పనులు చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో తహసీల్దారు కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో సెంట్రింగ్ పనులు చేస్తుండగా పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ తీగలకు ఇనుపరాడు తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన అశోక్

14న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 11: ఈ నెల 14వ తేదీ నెల్లూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ పర్సన్ 10 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని, 30 ఏళ్లలోపు వయసు, డిగ్రీ విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ.25 వేలు వేతనం లభిస్తుందన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సురెన్స్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ 20 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని, 32 ఏళ్లలోపు వయసు కలిగి, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ విద్యార్హతులు కలిగిన వారు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారికి రూ.16,500 జీతం, ఇన్సెంటివ్‌లు ఇస్తారన్నారు. కోస్టల్ పవర్ కేర్ ఇంజనీర్స్ సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు-1, సర్వీస్ టెక్నీషియన్ పోస్టులు-2 ఉన్నాయని తెలిపారు. ఐటీఐ, డిప్లమో, డిగ్రీ విద్యార్హత కలిగిన వారు ఎంపికలకు హాజరు కావచ్చన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం లభిస్తుందన్నారు. యాక్ట్ ఫైబర్ నెట్‌లో నెట్‌వర్క్ ఇంజనీర్ అండ్ సేల్స్ 200 పోస్టులు ఉన్నాయని, 18 నుంచి 27లోపు వయసు, పదోతరగతి, ఐటీఐ విద్యార్హతలు కలిగిన వారు ఎంపికలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారికి రూ. 13 వేల నుంచి రూ.18,500 వరకు జీతం ఇస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్‌కార్డుతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	156
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	204


బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6782
వెండి కిలో ధర	రూ. 90,200
వెండి ఒక గ్రాము	రూ. 92.20

ఎన్నాళ్లో వేచిన ఉదయం

- కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలతో జనం
- సంక్షేమంతోపాటు అభివృద్ధి సాకారమవుతుందనే నమ్మకం



ప్రజలు కోరుకున్న ప్రజా ప్రభుత్వం నేడు కొలువు తీరుతోంది. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై నమ్మకంతో ఓటేసిన ప్రజలు తమ బతుకులు బాగుపడతాయనే కొండంత ఆశగా ఎదురుచూస్తున్నారు. యువత తమ భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని ఆశిస్తున్నారు. ఇన్నాళ్ల కడగళ్లు తీరుతాయని, సాగునీటి ప్రాజెక్టుల రూపురేఖలు మారుతాయని, దళారులు లేని కాలం దగ్గర్లోనే ఉందని అన్నదాతలు నమ్ముతున్నారు. గూడు కోసం ఎదురుచూసిన పేదలు, నాణ్యమైన మందు కోసం కష్టజీవులు, చిరుగుల బతుకులు బాగుపడుతాయని చేనేతలు, కనీస అభివృద్ధికి నోచుకోక పాడుపడిన పట్టణాలు బాగుపడుతాయని పట్టణవాసులు, ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు, పింఛన్లు అందుతాయని వేతనజీవులు.. ఇలా అన్ని వర్గాలు కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకుంది. గడిచిన ఐదేళ్ల కష్టం.. త్వరలోనే కడతేరి పోతుందని కొండంత నమ్మకంతో ఉన్నారు.

\- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

● **ఇసుక దోపిడీ :** చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఉచితంగా లభించే ఇసుకకు జిల్లా ప్రజలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసుకున్నారు. పెన్నా పరివాహక ప్రాంతంలో విస్తారంగా ఇసుక లభిస్తున్నా వైసీపీ ప్రభుత్వంలో మాత్రం బంగారంగా మారిపోయింది. బండెడు ఇసుక కోసం వేల రూపాయలు చెల్లించుకోవాల్సి వచ్చింది. ఎంత డబ్బు చెల్లించినా ఇసుక దొరకని పాడు కాలాన్ని జిల్లా ప్రజలు చూశారు. కళ్లముందే టిప్పర్లకు టిప్పర్ల ఇసుక పక్కనున్న తమిళనాడుకు తరలిపోతున్నా నోరు మెదిపే సాహసం చేయలేకపోయారు. చంద్రబాబు పాలనలో అయినా ఇసుక కష్టాలు తీరాలని ప్రజలు ఆశిస్తున్నారు.

● **గూడు గోడు :** కొత్త ప్రభుత్వం కోసం జిల్లా ప్రజలే కాదు... టిడ్కో ఇళ్లూ ఎదురుచూస్తున్నాయి. వాటికే మాటలొస్తే తమ గోడు పట్టించుకో మహాప్రభు అని వేడుకుంటాయి. టీడీపీ ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా 40 వేల ఇళ్లు కట్టారు. కొన్ని పూర్తి అయ్యాయి. కొన్ని 90 శాతం, మరి కొన్ని 70 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే, గడచిన ఐదేళ్ల కాలంలో పూర్తయిన ఇళ్లు నిరుపయోగంగా వదిలేశారు. అర్ధంతరంగా ఆగిన నిర్మాణాలనూ గాలికి వదిలేశారు. ఈ ఇళ్లన్నీ తెలుగుదేశం ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ ప్రభుత్వంలో అన్ని హంగులతో నిరుపేదల పాలిట ఆలయాలుగా మారాలని కోరుకొంటున్నాయి.

● సోమశిల ప్రాజెక్టు ఆప్రాన్ పనులు అత్యవసరంగా పూర్తి చేయాలి. సోమశిల, కండలేరు వరద కాలువ, ఉత్తరకాలువల విస్తరణ పనులు పూర్తి చేయాలి. ముదువర్తి కాజ్‌వే పనులు ప్రారంభించాలి. బండేపల్లి-దేగపూడి కెనాల్ పనులు మొదలు పెట్టాలి. నెల్లూరు నగరం వరద ముంపు నుంచి కాపాడుకోవడానికి పెన్నా రక్షణ గోడల నిర్మాణం చేపట్టాలి. అర్ధంతరంగా ఆగిన సర్వేపల్లి రిజర్వాయర్ పనులతోపాటు నెల్లూరు, సంగం బ్యారేజ్‌ల్లో అసంపూర్తి పనులనూ పూర్తి చేయాలి. సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్ -1,2 పూర్తి చేయాలి.

● గత ఐదేళ్ల కాలంలో జిల్లాలో ఒక్కంటే ఒక్క భారీ పరిశ్రమ కూడా రాలేదు. ఇండస్ట్రియల్ పార్కులన్నీ బీడుపడిపోయాయి. ఆమంచర్ల, బొడ్డువారిపాళెం, సీఎస్ పురం వద్ద ఇండస్ట్రియల్ పార్కుల్లో ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ తరలి వెళ్లిపోయింది. గత ప్రభుత్వం మీద నమ్మకం లేక పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదు. చంద్రబాబు పాలనలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తుందని ఆశిస్తున్నారు.

● వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి గత ప్రభుత్వం మంగళం పాడింది. సబ్సిడీకి వ్యవసాయ యంత్రాలు లేవు. డ్రిప్ ఇరిగేషన్ లేదు. చివరికి సబ్సిడీ విత్తనాలు కూడా కరువయ్యాయి. ఈ పథకాలన్నీ తెలుగుదేశం ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని అన్నదాతలు ఆశిస్తున్నారు.

● టూరిజం అభివృద్ధి చేయాలనే ధ్యాసే లేకుండా ఐదేళ్ల పాలన సాగిపోయింది. ఉదయగిరి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆ ఊసే లేదు. సుదీర్ఘ సముద్ర తీరం ఉన్నా ఒక బీచ్‌ను అభివృద్ధి చేసిన దాఖలా లేదు. టీడీపీ హయాంలో బీచ్‌ల వద్ద నిర్మించిన రిసార్ట్‌లు కూడా నిర్వహణ లేక పాడుపడ్డాయి. మైపాడు బీచ్ వరకు సీఆర్‌ఎఫ్ పథకం కింద కేంద్ర నిధులతో నాలుగు లైన్ల రోడ్డు మంజూరైనా పనులు మొదలు కాలేదు.

● మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అవకాశం ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించని కారణంగా ఫిషింగ్ హార్బర్ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఆక్వా రంగానికి చేయూత కరువయ్యింది.

● చేనేత రంగం చతికిలపడింది. నేతన్నకు చేతినిండా పనిలేదు. పని దొరికినా గిట్టుబాటు ధర లేదు. ప్రభుత్వం చేనేత బట్టలను కొనుగోలు చేస్తే తప్ప పరిస్థితి మారేలా లేదు.

● గత ఐదేళ్ల కాలం ప్రజలకు దగ్గరగా సేవలందించిన వలంటీర్లు వైసీపీ నాయకుల నుంచి రకరకాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. రూ.5వేలు జీతం ఇచ్చి వెట్టి చాకిరీ చేయించుకున్నారు. బానిసలకన్నా హీనంగా చూశారు. ఎన్నికల సమయంలో బెదిరించి ఒత్తిడి చేసి ప్రచారానికి వినియోగించుకున్నారు. కొత్త ప్రభుత్వం ఆగమనంతో వీరు ఊపిరి పీల్చుకున్నారు. చంద్రబాబు 10వేల జీతం ఇస్తారని, హాయిగా పనిచేసుకునే వాతావరణం కల్పిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

● నడికుడి -శ్రీకాళహస్తి రైల్వేలైను పనులు ఒక ప్రహసంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా, కేటాయించాల్సిన భూమి విషయాల్లో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కేంద్ర ప్రభుత్వం రైల్వే లైను నిర్మాణానికి బడ్జెట్ కేటాయింపులు ఆపేసింది. ఈ ప్రభుత్వంలో అయినా ఈ ప్రాజెక్టు పూర్తి కావాలని ప్రజలు ఆశిస్తున్నారు.

● వేతనజీవులు కొత్త ప్రభుత్వం వైపు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. డిమాండ్లు చాలానే ఉన్నా వాటికన్నా ముఖ్యంగా ప్రతి నెల ఒకటవ తేదీన జీతాన్ని కోరుకొంటున్నారు. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగులు పింఛను కోసం పడిగాపులు పడే రోజులు ఇక రావనే ఆశిస్తున్నారు.

● అన్ని వర్గాలకు దీటుగా మందుబాబులు గత ఐదేళ్ల పాలనలో నరకం అనుభవించారు. మందు ధర మూడు రెట్లు పెరిగిపోయింది. దానికితోడు నాశిరకం మద్యం ఆరోగ్యాలను గుల్ల చేసింది. చంద్రబాబు పాలనలో మద్యం బ్రాండ్లు మారుతాయని, రేట్లు తగ్గుతాయని కష్టజీవులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఈఏపీసెట్ ఫలితాలు విడుదల

- జిల్లాలో 85 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు (విద్య), జూన్ 11 : ఏపీఈఏపీ సెట్ ఫలితాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఇంజనీరింగ్, వ్యవసాయ కోర్సులకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ఈఏపీసెట్‌లో మే 16, 17వ తేదీల్లో బైపీసీ స్ట్రీమ్‌కు, 18 నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 16వేలమందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడంతో పాటు మొత్తం మీద 85శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ విభాగంలో దగదర్తి మండలం వెలుపోడు గ్రామానికి చెందిన కడప చైతన్య 54వ ర్యాంకు, నెల్లూరులోని మూలాపేటకు చెందిన బిరుదురాజు బద్రీనాథ్ వర్మ 88, కందుకూరుకు చెందిన దార్ల భరత్‌చంద్ర 242, కందుకూరు యర్రగుంటపాలెంకు చెందిన తూమాటి నవీన్‌చంద్ర చౌదరి 275, నెల్లూరులోని నవాబుపేటకు చెందిన అమృతలూరు వెంకట నిఖిత్‌బాబు 313, కావలికి చెందిన కొండూరు ప్రిస్కిల్లా సాత్విక 315, మాగుంటలేఅవుట్‌కు చెందిన కంచంరెడ్డి మహేంద్రరెడ్డి 319, కొండాయపాళెం రోడ్డులో నివాసం ఉండే రాయ వరపు రాకేష్ 417, వెంకటాచలం మండలం పూడిపర్తికి చెందిన బొణిగి శ్రీనాథ్ 460, నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన వెంట్రాప్రగడ జితేంద్ర 492వ ర్యాంకు సొంతం చేసుకున్నారు. అలాగే అగ్రికల్చర్-ఫార్మసీ అండ్ బీఎస్సీ నర్సింగ్ విభాగంలో నగరంలోని దర్గామిట్ట సుజాతమ్మకాలనీకి చెందిన కోయగురు వెంకట సాత్విక్ 17వ ర్యాంకు, నూకనపల్లికి చెందిన సన్నపురెడ్డి సాయి గణేష్ 44, చిల్డ్రన్స్‌పార్కు సమీపంలో నివాసం ఉండే బలంత్రపు ఫణి శ్రీశశాంక్ 70, కొండాయపాళెంకు చెందిన అట్ల చెంచుఈశ్వర్ ప్రసాద్ 77, వావిలేటుపాడుకు చెందిన మల్లెల లాస్య ప్రియ 106, నగరంలోని యనమలవారివీధికి చెందిన యనమల బ్రాహ్మిణి 174, జడ్పీ కాలనీకి చెందిన కాసిరెడ్డి మోజ్జరెడ్డి 177, దామరమడుగుకు చెందిన షేక్ తాస్మియా 194, వింజమూరుకు చెందిన మర్తల జాహ్నవి 224, బాలాజీనగర్‌కు చెందిన మక్కం లక్ష్మీవైష్ణవి 263వ ర్యాంకు సాధించారు.

ఈఏపీసెట్‌లో కలువాయి విద్యార్థికి 44 ర్యాంక్



కలువాయి : ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో కలువాయికి చెందిన సన్నపురెడ్డి సాయి గణేష్ అగ్రికల్చర్, ఫార్మా విభాగంలో 44 ర్యాంకు సాధించారు. ఇదే విభాగంలో తెలంగాణా లోనూ 51 ర్యాంక్ సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో కూడా 701 మార్కులు సాధించి 1860 ర్యాంకును సొంతం చేసుకున్నారు. కలువాయిలో కూరగాయల వ్యాపారం చేస్తున్న శ్రీనివాసులు, శిరీషల చిన్న కుమారుడు సాయిగణేష్ ఇటీవల రాసిన అన్నీ ప్రవేశ పరీక్షల్లోనూ ఉత్తమ ప్రతిభ చూపారు. ఈ మేరకు ఆ విద్యార్థిని పలువురు అభినందిస్తున్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల పేరుతో రూ. 16 లక్షల వసూలు..?

- దొరవారి సత్రం సూపర్‌వైజర్ నిర్వాకం
- ఆడియో సంభాషణతో వెలుగులోకి..



డీఎంహెచ్‌వో కార్యాలయం

నెల్లూరు(వైద్యం) జూన్ 11 : వైద్య ఆరోగ్యశాఖలో అవినీతి రాజ్యమేలుతున్న విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. తాజాగా ఆ శాఖ ఉద్యోగులే తోటి ఉద్యోగులకు కుచ్చుటోపీ పెట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వైద్య శాఖలో బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ పేరుతో తిరుపతి జిల్లా దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ కిరణ్ తనను నిండా ముంచేశారని నాయుడు పేట మండలం గొట్టిప్రోలు పీహెచ్‌సీలో పనిచేసే స్టాఫ్‌నర్సు ఆరోపించారు. రెండు స్టాఫ్‌నర్సు పోస్టులతోపాటు ఎఫ్‌ఎన్‌వో, ఎంఎన్‌వో, ఆఫీస్ బాయ్ వంటి ఆరు బ్యాక్‌లాగ్ పోస్టులు త్వరలో విడుదల వుతున్నాయని, వాటిని తెలిసిన వారికి ఇప్పిస్తానని నమ్మబలికి రూ.16 లక్షలు వసూలు చేసినట్లు తాజాగా విడుదల చేసిన ఆడియో సంభాషణతో వెల్లడైంది. వసూలు చేసిన మొత్తాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ మహేష్ ద్వారా డీఎంహెచ్‌వోకు అందజేయాలని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తనకు అధికారులు న్యాయం చేయాలని, లేకపోతే కుటుంబం ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని బాధిత స్టాఫ్‌నర్సు వాపోయారు. జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ తిరుపతి జిల్లాకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉద్యోగాల భర్తీ నెల్లూరు డీఎంహెచ్‌వో ద్వారానే జరగాల్సి ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న సూపర్‌వైజర్ కిరణ్ అక్రమాలకు పాల్పడినట్లు ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉంటే, జూనియర్ అసిస్టెంట్ మహేష్ తాజాగా విడుదల చేసిన ఆడియో సంభాషణపై డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. తనపై అభాండాలు వేస్తున్నారని, డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మహేష్ కోరుతున్నారు. కాగా, ఈ అక్రమ వసూళ్లపై మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ శ్రీకాంత్ ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

విచారణ జరిపి నివేదిక ఇస్తాం

దొరవారిసత్రం సూపర్‌వైజర్ కిరణ్ అక్రమాలపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. బ్యాక్ లాగ్ ఖాళీల పేరుతో ఇలాంటి అక్రమాలకు పాల్పడటం సరికాదు. తాజాగా విడుదల చేసిన ఆడియోలో సంభాషణ స్పష్టంగా ఉంది. డీఎంహెచ్‌వో పేరుతో ఏకంగా రూ.16 లక్షలు వసూలు చేశారంటే ఇది పెద్ద నేరమే. ఇలాంటివి సహించేది లేదు.

\- డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌వో

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- యూఈఈయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సూరిబాబు

కావలిటౌన్, జూన్ 11: విద్యుత్ రంగంలో పనిచేసేసే కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (యుఈఈయు) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు పేర్కొన్నారు. మంగళవారం యుఈఈయు కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు నాగార్జున అధ్యక్షతన జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ముఖ్య అతిథులుగా సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుమన్ పాల్గొన్నారు. సూరిబాబు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సబ్ స్టేషన్లలో పని చేసే వాచ్‌మెన్‌లను యధావిధిగా కొనసాగించాలని, మీటర్ రీడర్లకు కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 2022 పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. బొజ్జ సుమన్ మాట్లాడుతూ కార్మికులందరికీ ఒకే వేతన విధానం అమలు చేయాలని కోరారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మనోహర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పిట్టి నాగార్జున, కోశాధికారిగా శ్రీనివాసులు తదితరులు ఎన్నికయ్యారు.

522 పొగాకుబేళ్లు కొనుగోలు

కలిగిరి, జూన్ 11: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 603 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 522 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-45, సీఆర్-24, జంపింగ్‌లాట్స్-12 కారణాలతో 81 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.330, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.277.52గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

సోమశిలకు 2,456 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, జూన్ 11: సోమశిల జలాశయంకు ఎగువ నుంచి మంగళవారం 2,456 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 8.013 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు కొనసాగుతుంది.

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ శోభ


విద్యుత్ వెలుగుల్లో కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం

కందుకూరు, జూన్ 11: రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నేతృత్వంలో నూతన ప్రభుత్వం కొలువుదీరుతున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని కందుకూరులో ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం పట్టాభిషేకంకు రాజధానిలో ఏర్పాట్లు జరుగుతుండగా ఇక్కడ మంగళవారం రాత్రి ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపకాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. కందుకూరులోని సబ్ కలెక్టరు కార్యాలయం, సబ్ కలెక్టరు బంగ్లా, మండల రెవెన్యూ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీపాల వెలుగులతో ప్రజలను ఆకర్షించాయి.

అల్లూరు : నూతన ప్రభుత్వం ఏర్పాటుకు ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయబోతున్న శుభసందర్భంగా మండలంలోని అన్ని కార్యాలయాలు విద్యుత్ దీపాలంకరణతో కాంతులీనాయి. దీంతో కార్యాలయాలకు నూతన శోభ సంతరించుకుంది. ఎన్నడూ లేని విధంగా కార్యాలయాలకు విద్యుత్ దీపాలంకరణ చేయడంతో స్థానిక ప్రజలు ఆశ్చర్యచకితులయ్యారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఈ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలుసుకొని హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయంటూ మాట్లాడుకుంటున్నారు.


అల్లూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి విద్యుత్ దీపాలంకరణ


వరికుంటపాడు వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలు

వరికుంటపాడు : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం పలు ప్రభుత్వ కార్యాలయాలు రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణలతో నూతన శోభను సంతరించుకున్నాయి. ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంతో పాటు వెలుగు, ఉపాధిహామి పథకం కార్యాలయాలు సైతం ముస్తాబయ్యాయి.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లింగసముద్రం, జూన్ 11 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్లో అన్ని తరగతులలో సీట్లు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్తార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంగ్లీషు మీడియంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అడ్మిషన్స్ జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి తరగతిలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు 7017286715ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు ఫిర్యాదుల స్వీకరణ

పలేటివారిపాలెం, జూన్ 11 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13వ తేది గురువారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తహసీల్దారు నాగేమల్లేశ్వరావు, ఎంపీడీవో రఫీక్అహ్మద్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలస్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మొక్కలు నాటిన పూర్వ విద్యార్థులు


మొక్క నాటుతున్న పూర్వవిద్యార్థులు

కావలి, జూన్ 11: కావలి పట్టణం విశ్వోదయ బాలురఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పాఠశాలలో 1971 నుంచి 1981 వరకు చదివిన పూర్వవిద్యార్థులు మొక్కలు నాటారు. పూర్వ విద్యార్థి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పల్లెబోయిన మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ద్వారకానాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని పూర్వవిద్యార్థులను అభినందించారు. పాఠశాలను వదిలి 43 సంవత్సరాలైనా ఇంకా అనుబంధాన్ని కొనసాగించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రోసిరెడ్డి, సాయి, రియాజ్, మాలకొండల రావు, శివకుమార్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి సప్తమి వార్షికోత్సవాలు

అల్లూరు, జూన్ 11 : స్థానిక అభయాంజనేయస్వామి పుష్కరిణి క్షేత్రంలో బుధ, గురువారాలు నిర్వహించే సప్తమి వార్షికోత్సవ ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం క్షేత్రం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికి పుష్కరిణి క్షేత్రాన్ని నిర్మించి ఏడేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఉదయం 8.30 గంటలకు హనుమాన్ శోభా యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గురువారం స్వామివారికి అభిషేకాలు, సేవా కార్యక్రమాలు, హోమాలు, కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్టల కమలాకర్, కారుమంచి కార్తీక్ శర్మ, నారాయణ స్వామి, పొన్నపూడి శ్రీనివాసులు, శివ, కళ్యాణ్, పోలయ్య, చక్రాతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన 22 మంది పిల్లల గుర్తింపు

కొండాపురం, జూన్ 11: మండలంలో మేనెల 1 నుంచి ఈనెల 9వ తేదీ వరకు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఐఈఆర్‌పీలు నిర్వహించిన సర్వేలో ప్రత్యేక అవసరాలు కలిగిన 18 ఏళ్ల లోపు 22 మంది పిల్లలను గుర్తించినట్లు మండల విద్యాశాఖ అధికారులు కే.రవికుమార్, ఆనందరావులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బడిఈడు పిల్లలను గుర్తించి వారిని బడులలో చేర్పించడమే లక్ష్యంగా ఈ సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు, ఆశా కార్యకర్తల సహకారంతో ఐఈఆర్‌పీలు డేగ హరిబాబు, బ్రహ్మయ్య ఈ సర్వే నిర్వహించారని పేర్కొన్నారు. వీరందరికీ శారీరక అంగవైకల్యాలను బట్టి ప్రత్యేక అవసరాల పరికరాలను ఏర్పాటు చేసి బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సంబరాలను జయప్రదం చేయండి

ఉదయగిరి రూరల్, జూన్ 11: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించే సంబరాలను జయప్రదం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాణస్వీకార మహోత్సవాన్ని తిలకించేందుకు బస్టాండ్ సెంటర్‌లో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయడంతో జరుగుతుందన్నారు. మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీఎం ప్రమాణస్వీకారం వీక్షణకు ఎల్ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు

కందుకూరు, జూన్ 11: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసే మధురఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు కందుకూరు నియోజకవర్గంలో రెండు భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో ఒక స్క్రీన్, గుడ్లూరులోని గొల్ల కాంతయ్య కళ్యాణమండపంలో మరో స్క్రీన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రెండు గడ్డివాముల దగ్ధం

కొండాపురం, జూన్ 11: మండలంలోని గానుగపెంటలో మంగళవారం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన జడ లక్ష్మయ్య, తాటిపరి రసూల్‌కు చెందిన గడ్డివాములు పక్కపక్కనే ఉన్నాయి. బాధితుల కథనం మేరకు.. ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పంటు కుంది. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక శాఖ అధికారులకు తెలియపరచినా సకాలంలో స్పందించకపోవడంతో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఒక్కొక్కరికి రూ.60 వేల నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

● కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి


ప్రజలతో మాట్లాడుతున్న కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి

లింగసముద్రం, జూన్ 11 : ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కందుకూరు సబ్ కలెక్టర్ జీ విద్యాధరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు సబ్ కలెక్టర్ విద్యాధరి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడంతో పాటు శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా లింగసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు అడపా రంగయ్య, మాజీ ఎంపీపీ పీ.బాలకోటయ్యలు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి, గతంలో కొందరు అధికారులు లింగసముద్రంలో సర్వే నంబరు 79ని నిషేధిత భూముల జాబితాలో చేర్చారని, దీని వలన స్థలాలు, ఇళ్ల విక్రయించాలన్నా, కొనాలన్నా వీలు కావడం లేదని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే ఆక్రమణకు గురైన బంగారమ్మ గుడి స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆమె తహసీల్దారు జి.శ్రీచరణ్‌ను ఆదేశించారు. లింగసముద్రంలో లోవోల్టేజీ సమస్య పరిష్కరించేందుకు 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పంచాయతీ కార్యదర్శి మాధవరావు సూచనతో ఓ స్థలాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఓ మహిళకు సంబంధించిన పిండిమిల్లును పరిశీలించారు. అంబేడ్కర్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యుశేషబాబు, డీటీ టి.ప్రసాద్, ఎంఈవో-1 కె.రవికుమార్, ఎంఈవో-2, శివకుమార్, ఏఈ టీ.సాగర్ ఇంకా పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి రాకుండా టీకాలు వేసుకోవాలి

బిట్రగుంట, జూన్ 11: క్షయవ్యాధి రాకుండా అడల్ట్ బీసీజీ టీకా 18 ఏళ్ల పైబడి టీబీ, , షుగర్ వ్యాధి గ్రస్తులు, పొగాకు అలవాటు ఉన్న 60 ఏళ్ల పైబడిన వారు వేసుకోవచ్చని జిల్లా క్షయ, కుష్టు నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న బీసీజీ టీకాలకు సంబంధించిన రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించి వాటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందించే వైద్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జహరిక, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఉదయగిరి రూరల్, జూన్ 11: వైద్యఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకల్పన హెచ్చరించారు. మంగళవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. గర్భిణుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీ



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది


కలిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఆత్మకూరు, జూన్ 11: పట్టణంలోని యూపీహెచ్‌సీలో మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సదస్సు, ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వైద్యాధికారులు, సిబ్బంది సోమశిల రోడ్డు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ అస్మా మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్ గున్యా, తదితర రోగాలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రతి ఒక్కరూ మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే అంటువ్యాధులు దరిచేరవని వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సిద్ధం సుధాకర్, ఎంపీహెచ్ఎస్ పార్వతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కలిగిరి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి మాట్లాడుతూ మలేరియాపై అవగాహన పెంచుకోవాలన్నారు. మలేరియా జ్వరానికి పూర్తిగా ప్రభుత్వ ఆసత్రిలోనే మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ప్రతి శుక్రవారం ప్రతి ఇంట్లో ఫ్రైడే తోపాటు డ్రైడే పాటించాలని పేర్కొన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకుండా వైద్యసేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బం ది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉదయగిరిరూరల్ : సూచనలిస్తున్న బ్రిజిత


సీతారామపురంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

సీతారామపురం : మండలంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో మంగళవారం 'ఆశా'డే సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో డయేరియా ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. ముఖ్యంగా ఐదు సంవత్సరాల పిల్లల్లో వాంతులు విరేచనాలు నివారించు టకు ఆశా వర్కర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు స్టాక్ పెట్టుకోవాలని, నిలువ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని తెలిపారు. అలాగే డాక్టర్ భవ్యశ్రీ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో మజీద్, ఎంపీహెచ్ఎస్ రియాజ్, ఎం పీఎస్ కిష్టమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కావలి డివిజన్ ప్రోగ్రామ్ అధికారిణి బ్రిజిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్య పెంచేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ ను అర్హులైన ప్రతిఒక్కరికి వేయాలన్నారు. అనంతరం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో సీహెచ్‌వో ఓంకారయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, హెచ్‌వీ బీబీజాన్, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్, అరుణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ


పొంగళ్లను అమ్మవారి సన్నిధి మోసుకొచ్చిన భక్తులు

బిట్రగుంట, జూన్ 11: బోగో లు మండలం కోవూరుపల్లిల్లో వెలసి ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల కార్యక్రమంలో భాగంగా మూడ వ రోజు మంగళ వారం గ్రామ పొంగళ్లు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ తిరునాళ్లకు వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారికి పొట్టేళ్లు, కోళ్లను కానుకగా అందచేశారు. అమ్మ వారి పూల అలంకరణ కనువిందు చేసింది.

దార్ల భరత్‌చంద్రకు బీటీఏ అభినందన

కందుకూరు, జూన్ 11: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఎస్సీ విభాగంలో జాతీయ స్థాయిలో 86వ ర్యాంకు సాధించిన కందుకూరుకు చెందిన దార్ల భరత్‌చంద్రను బీటీఏ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక బీటీఏ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని భరత్‌చంద్రను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లగుంట మోహనరావు, భరత్‌చంద్ర తల్లిదండ్రులు దార్ల నరసింహం, సుధారాణి, బీటీఏ నాయకులు షేక్ అబ్దుల్లా, సంగా మహేంద్ర, ఎం. రమణయ్య, పర్రె వెంకటరావు, గడ్డం శివరామయ్య, కొప్పోలు శ్రీనివాసరావు, చొప్పర కొండలరావు, ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం, కరేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ

ఉదయగిరి రూరల్, జూన్ 11: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను ఎంఈవో షేక్ మస్తాన్‌వలి బృందం మంగళవారం తనిఖీ నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధనా సిబ్బంది అర్హతలు, పాఠశాలల వాహనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు, రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశా లలను నిర్వహించడంతో పాటు సిలబస్ బోధించాలన్నారు. అనంతరం నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు, శివరామిరెడ్డి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

పాఠ్య పుస్తకాల సరఫరా

సంగం, జూన్ 11: మండలంలో ఇప్పటికి రెండు విడతలుగా 1 నుంచి 10వ తరగతి వరకు 16,597 పాఠ్య పుస్తకాలు సరఫరా అయినట్లు ఎంఈవో జానికీరామ్ తెలిపారు. ఇంకా 7వ తరగతి సైన్స్ సోషల్ పాఠ్య పుస్తకాలతో పాటు 10వ తరగతి ఫిజికల్ సైన్స్ పాఠ్య పుస్తకాలు పూర్తిగా సరఫరా కాలేదు. అదే విధంగా నోటు పుస్తకాలు, బ్యాగ్‌లు, విద్యార్థుల షూస్ కూడా రాలేదని, త్వరలో వస్తాయని ఆయన తెలిపారు.


పాఠ్య పుస్తకాలను సరిచూసుకుంటున్న సిబ్బంది

అర్బన్ హెల్త్ సెంటర్‌పై వైఎస్సార్ పేరు, బొమ్మలు తొలగింపు

కావలి, జూన్ 11: కావలి పట్టణం వైకుంఠపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవనంను ఎన్నికల కోడ్‌కు ఒక రోజు ముందు హడావుడిగా ప్రారంభించారు. అయితే ఆ భవనంపైన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం అని తెలుగు, ఇంగ్లీషులలో విడివిడిగా బోర్డు రాశారు. అలాగే ఆ భవనం గోడపైన ఒక పక్క వైఎస్సార్, జగన్ బొమ్మలను జంటగా వేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కావలి ఎమ్మెల్యేగా కూటమికి చెందిన కావ్య క్రిష్ణారెడ్డి గెలుపొందడంతో టీడీపీ అనుచరుల దృష్టి పట్టణ ఆరోగ్య కేంద్రంపై పడింది. దీంతో మంగళవారం పెయింటర్‌ను తీసుకువచ్చి ఆ పేర్లు బొమ్మలను తొలగించి పెయింటింగ్ వేశారు.




వైకుంఠపురం హెల్త్‌సెంటర్‌కు తొలగించిన వైఎస్సార్ పేరు, బొమ్మలకు వేస్తున్న రంగు

ఫారుఖ్అలీకి జేవీవీ ఘన నివాళి

ఉదయగిరి, జూన్ 11: జన విజ్ఞాన వేదిక నాయకులు, రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి గాజుల ఫారుఖ్అలీ లేని లోటు తీరనిదని పలువురు వక్తలు మంగళవారం పేర్కొన్నారు. ఉదయగిరికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఫారుఖ్అలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఉర్దూ ఉపాధ్యాయ వృత్తికి ఆయన వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు గూడూరు వెంకటేశ్వరరావు, తాజుద్దీన్, దస్తగిరిఅహ్మద్, శ్రీనివాసులరెడ్డి, కాకు వెంకటయ్య, ఫరుద్దీన్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


షాదీ మంజిల్‌లో మాట్లాడుతున్న వక్తలు

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవం

లింగసముద్రం, జూన్ 11 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో మద్ది రాట్ వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ తిరునాళ్లను పురస్కరించుకొని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాల యాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. గ్రామంలో నేతి కడవను ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొ న్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి కోలాట ప్రద ర్శనలు ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త కూర్పు

నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. కొత్త మంత్రివర్గం 71 మందిలో ముప్పైమందికి కేబినెట్ హోదా లభించింది. ఐదుగురు స్వతంత్ర, ముప్పై ఆరుగురు సహాయ మంత్రులు ఉన్నారు. మిత్రపక్షాల కరుణాకటాక్షాల ఆధారంగా దేశాన్ని ఏలాల్సిన స్థితిలో ఉన్నప్పటికీ, నరేంద్రమోదీ ఈ మంత్రివర్గ కూర్పులో తనదే పైచేయి అనిపించుకున్నారని, ఊతమిస్తున్నవారి ఒత్తిళ్ళకు పెద్దగా లొంగలేదని కొందరి విశ్లేషణ. కొందరు పాతవారు పోయి, శాఖల్లోనూ మార్పు చేర్పులు ఉన్నా, అధికంగా గత మంత్రులే ఉన్నందున మార్పు ప్రభావవంతంగా అగుపించడం లేదు. సొంతబలం లేకున్నా కూడా, గతకాలపు కొనసాగింపుగానే కనిపించాలన్న ప్రత్యేక ప్రయత్నం ఈ మంత్రివర్గం కూర్పులో అత్యధికులకు కనిపిస్తున్నది.

ఆర్థికం, హోం, రక్షణ, విదేశీవ్యవహారాలు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, రైల్వేల వంటి కీలకమైన శాఖల్లో ఏ మార్పులేదు. ఈ మారు కూడా మంత్రుల్లో ముస్లింలు లేరు. ఏడుగురు ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, ఏడుగురు మహిళలకు మోదీ టీంలో చోటుదక్కింది. యూపీ నేర్పిన గుణపాఠం వల్ల కాబోలు, ఓబీసీల ప్రాతినిధ్యం కూడా గట్టిగానే ఉంది. పంజాబ్‌లో బలంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీతోనూ, కేరళలో ఎల్‌డీఎఫ్‌తోనూ యుద్ధం కొనసాగించాలి కనుక, తమిళనాడులో ఎదురుదెబ్బ తిన్నా విస్తరణయత్నాలు ఆగకూడదు కనుక ఆ రాష్ట్రాలనుంచి ఓడినవారికి కూడా ప్రాతినిధ్యం లభించింది. ఖలిస్తానీ ఉగ్రవాదుల చేతిలో హతమైన కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ మనుమడు రవ్‌నీత్‌సింగ్ బిట్టూ ద్వారా పంజాబ్‌లో ఎదగాలన్నది బీజేపీ ప్రయత్నం. ఒక్కసీటూ గెలవకపోయినా ఆప్, కాంగ్రెస్ తరువాత ఓట్లవాటాలో మూడోస్థానంలో ఉన్నందున బీజేపీ ఆశని కాదనలేం. కేరళలో ఒక్కసీటు గెలిచి ఖాతా తెరిచిన సంతోషంలో ఆ రాష్ట్రానికి రెండు పదవులు ఇచ్చినా, నటుడు సురేష్ గోపి అలగడం, రాజీపడటం తప్పలేదు. కేరళలో ఈ ఎన్నికల్లో బీజేపీ ఓట్లవాటా 17శాతం తాకి, 11 అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి బలాన్ని ప్రదర్శించిన నేపథ్యంలో, జార్జి కురియన్ ఎంపిక క్రైస్తవులకు సానుకూల సంకేతం పంపేందుకు ఉపకరిస్తుంది. తమిళనాట వీరోచిత పోరాటం చేసిన ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు అన్నామలై కాక, గతకాలపు నేత లోగనాథన్ మురుగన్‌ను మంత్రిగా తీసుకోవడం వెనుక దళిత ఉపకుల రాజకీయం ఉన్నదని అంటారు. ఇప్పుడు అంతగా ఆదరించనప్పటికీ, రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రాల ప్రజల మనసులను గెలుచుకోవడానికి ఈ పందేరం ఉపకరిస్తుంది.

కొత్త మంత్రివర్గాన్ని యువతరం, అనుభవజ్ఞులతో ఎంతో చక్కగా గుదిగుచ్చామని ప్రధానమంత్రి చెప్పుకున్నారు. ఐదుగురు తెలుగువారికి కేంద్రంలో చోటు దక్కడం అటుంచితే, మిత్రపక్షాలకు మొత్తంగా పదకొండు, ఐదుపార్టీలకు ఒక్కటి చొప్పున పదవులు దక్కాయి. బిహార్‌లో ముగ్గురు మిత్రులకు నాలుగు పదవులు ఇచ్చినా, మహారాష్ట్రలో ఎన్సీపీని చీల్చి, అత్యధిక సంఖ్యలో ఎమ్మెల్యేలను తెచ్చిన అజిత్‌పవార్‌తో ఇక అవసరం తీరిపోయిందని బీజేపీ భావిస్తున్నట్టుగా చర్చ జరుగుతోంది. ఎన్సీపీ మినహా అన్ని మిత్రపక్షాలకు మంత్రివర్గంలో స్థానం దక్కింది. ఇక, ఈ ఏడాది ఎన్నికలు ఉన్నందున మహారాష్ట్ర, హర్యానాలకు తగిన ప్రాతినిధ్యమే దక్కింది. ఖట్టర్‌ను తీసుకోవడం, మూడు పదవులు ఇవ్వడంలో హర్యానాను జారవిడుచుకోకూడదన్న ప్రయత్నం బలంగా కనిపిస్తున్నది. మహారాష్ట్ర కంటే, ఢిల్లీ పొరుగున ఉన్న హర్యానాలో ఓడిపోతే ఆ ప్రభావం నైతికంగా కేంద్రప్రభుత్వం మీద పనిచేస్తుంది.

గత ప్రభుత్వంలోని కీలకమైన మంత్రులను అదేశాఖలో కొనసాగించడం, నడ్డావంటివారిని కొత్తగా తేవడం వంటివి గమనించినప్పుడు మంత్రివర్గ కూర్పులో బీజేపీ ముద్ర విశేషంగా కనిపిస్తుంది. మిత్రపక్షాల అవసరం ఎంత ఉన్నప్పటికీ, వారిని కొంతమేరకే సంతృప్తిపరచి తనదే పైచేయి అనిపించుకుంది. కేబినెట్ మంత్రుల్లో పాతికమంది బీజేపీవారే అయినప్పటికీ, మిత్రపక్షాల ప్రాతినిధ్యం ఈ దేశ వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. దేశంలోని వేర్వేరు ప్రాంతాలనుంచి వచ్చినవారు మంత్రివర్గం పనితీరు మరింత మెరుగుపడేందుకు ఉపకరిస్తారు. భవిష్యత్తులో మంత్రివర్గాన్ని విస్తరించుకొనే వెసులుబాటు ఇంకా మిగిలివున్నందున, రాజకీయంగానో, సామాజిక కారణాలరీత్యానో స్వపక్షంనుంచో, మిత్రపక్షాలనుంచో మరికొందరికి చోటుకల్పించే అవకాశాలైతే లేకపోలేదు. అప్పుడు మరిన్ని వింతలూ విశేషాలు చూడవచ్చు.

నెహ్రూ హయాం నుండి ఇప్పటి వరకు విదేశాంగ విధానం అనేది పూర్తిగా కేంద్ర అంశం, అందులో రాష్ట్రాల ప్రమేయం ఉండదు. విదేశీ పర్యటనలు, ప్రముఖులతో సమావేశాలు, పెట్టుబడులు వగైరా అన్నీ విదేశాంగ మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుంది. కానీ దీనికి మినహాయింపుగా స్వాతంత్ర్య భారతంలో ప్రప్రథమంగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలతో, ప్రతినిధి బృందాలతో, పెట్టుబడులు తెస్తూ కొత్త ఒరవడిని నెలకొల్పారు.

రాష్ట్రాన్ని గ్లోబల్ ఎకానమీలో నిలిపిన నిపుణుడు


విశ్వసనీయత, అంకితభావంతో పాటు దార్శనికత కలిగిన నాయకులు ప్రజా జీవన ప్రమాణాలలో పరివర్తన తీసుకురాగలుగుతారు కానీ వర్తమాన భారతవనిలో ఈ తరహా నాయకులు అరుదు. స్థానికాంశాలలో మాత్రమే నిమగ్నమై ఉండే రాష్ట్ర స్థాయి నాయకులే తప్ప దూరదృష్టితో, అంతర్జాతీయ దృక్పథంతో, విదేశాల సౌజన్యంతో తమ రాష్ట్రాల అభివృద్ధి గూర్చి ఆలోచించేవారు బహు అరుదు.

నెహ్రూ హయాం నుండి ఇప్పటి వరకు విదేశాంగ విధానం అనేది పూర్తిగా కేంద్ర అంశం, అందులో రాష్ట్రాల ప్రమేయం ఉండదు. విదేశీ పర్యటనలు, ప్రముఖులతో సమావేశాలు, పెట్టుబడులు వగైరా అన్నీ విదేశాంగ మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుంది. కానీ దీనికి మినహాయింపుగా స్వాతంత్ర్య భారతంలో ప్రప్రథమంగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలతో, ప్రతినిధి బృందాలతో, పెట్టుబడులు తెస్తూ కొత్త ఒరవడిని నెలకొల్పారు.

1990లో శస్త్రచికిత్స కోసం 59 రోజులపాటు అమెరికాకు వెళ్ళిన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రపంచ బ్యాంకు నుంచి వరదల పునరావాస చర్యల కొరకు రూ.2800కోట్ల రుణాన్ని తీసుకు రావడం గురించి, న్యూయార్క్ నుండి ఫాక్స్ ద్వారా జీవోలు జారీ చేయడాన్ని గురించి అప్పట్లో గొప్పగా చెప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ తర్వాత, కొన్నాళ్ళకు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు దేశ విదేశాంగ విధాన తీరులో సమూల మార్పును తీసుకోవచ్చారు. అప్పటి వరకు రాష్ట్రాలతో సంబంధం లేకుండా నడిచిన విదేశాంగ విధానంలో రాష్ట్రాలకు కూడా పాత్ర ఉండాలంటూ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన వాదనకు జాతి ప్రయోజనాల దృష్ట్యా అందరి నుంచి ఆమోదం లభించింది. ఇప్పుడు 25ఏళ్ళ తర్వాత ఆయన తనయుడు లోకేశ్ కూడా బలమైన రాష్ట్రాలు లేకుండా భారత వికాసం ఎలా అంటూ అడుగుతుండడం ముదావహం.

గల్ఫ్ లేఖ

చంద్రబాబు దార్శనికత గూర్చి ఇక్కడ ప్రస్తావించాలి. ఇప్పుడు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు నిత్య జీవితంలో ఒక భాగమే, కానీ రెండు దశాబ్దాల క్రితం అనేక వర్ధమాన దేశాలలో సైతం ఈ-కామర్స్ గురించి పెద్దగా తెలియని కాలంలో చంద్రబాబు నాయుడు దుబాయిలో ఈ-కామర్స్ కేంద్రంగా పురుడు పోసుకుంటున్న ఇంటర్నెట్ సిటీని పర్యటిస్తానని ప్రత్యేకంగా ఆసక్తి చూపారు. అప్పట్లో దీనిపై ఇటు భారతీయ దౌత్యవేత్తలతో పాటు, అప్పటి దుబాయి యువరాజు, ప్రస్తుత రాజు అయిన షేక్ మోహమ్మద్ రాషేద్ అల్ మోఖ్తుం ఆశ్చర్యపోయారు. భవిష్యత్తు పట్ల ఇంత దార్శనికత కలిగిన ఈ భారతీయ నాయకుడు ఎవరా అని అరబ్బులు ఆసక్తిగా గమనించారు.



అప్పటికి ఇంకా బాలుడిగా ఉన్న నారా లోకేశ్‌తో కలిసి ఆయన దుబాయిలోని ఇంటర్నెట్ సిటీని పర్యటించి దాని తీరుతెన్నులను పరిశీలించి సైబరాబాద్‌లోని హైటెక్ టవర్ల నిర్మాణంలో దానికి అనుగుణంగా కొన్ని సూచనలు చేసారు.

పెరుగుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో విమానయాన రాకపోకలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని గ్రహించిన చంద్రబాబు నాయుడు శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి శ్రీకారం చుట్టడమే గాక అందులో విమానాలను నడపడానికి ఎయిర్‌లైన్స్ చుట్టు తిరిగారు. సంప్రదాయకంగా ఇరుదేశాల మధ్య జనవరిలో జరిగే ద్వైపాక్షిక విమానాల రాకపోకల ఒప్పందాలకు భిన్నంగా చంద్రబాబు నాయుడు ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు హైదరాబాద్‌లో ప్రత్యేక అనుమతి ఇప్పించారు. దాంతో 2001 జూలై 2న ప్రప్రథమ ఏమిరేట్స్ విమానం హైదరాబాద్‌లో దిగింది. అందులో దుబాయి నుంచి వచ్చిన ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అత్యున్నత అధికారి ఘయిత్ అల్ ఘయిత్ ఈ విమానం హైదరాబాద్‌కు రావడానికి కేవలం చంద్రబాబు నాయుడు కారణమని ప్రశంసించారు. ఈ విమానం ద్వారా దుబాయి మీదుగా అమెరికా, ఐరోపాలతో సహా ప్రపంచానికి హైదరాబాద్‌కు విమాన సౌకర్యం విరివిగా అందుబాటులో వచ్చింది.

ఆ తర్వాత వ్యూహాత్మకంగా హైదరాబాద్‌లో అమెరికన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజాలను ఆకర్షించిన చంద్రబాబు నగరంలో అమెరికా కాన్సులేటు నెలకొల్పడానికి నిర్విరామంగా చేసిన ప్రయత్నాలు చూసి సాక్షాత్తూ అమెరికా విదేశాంగ శాఖ సైతం నివ్వెరపోయింది. స్వాతంత్ర భారత చరిత్రలో అమెరికా ప్రప్రథమంగా నెలకొల్పిన కాన్సులేటు ఇదేనని అని చాలమందికి తెలియదు.

దశాబ్దకాలంగా కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమైన విదేశాంగ శాఖలోని 'లుక్ ఈస్ట్' విధానాన్ని చంద్రబాబు తన చేతల ద్వారా దేశానికి చూపించారు. చైనా, సింగపూర్, దక్షిణా కొరియాలతో వ్యూహాత్మక ఆర్థిక ప్రయోజనాలు సాధించారు.

2014లో జపాన్‌లో ఎన్నికలలో నిమగ్నమై ఉన్న ప్రధాని షింజో అబే, విశ్వఖ్యాత ఎలక్ట్రానిక్స్ సంస్థ పానసోనిక్ యాజమాన్యంతో సమావేశమవడానికి సందర్శిస్తానని చంద్రబాబు విజ్ఞప్తి చేయడంతో దౌత్యవేత్తలు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసారు. కానీ అవతలి వైపు నుండి వచ్చిన సానుకూలతతో వారిద్దరితో చంద్రబాబు నాయుడు మాట్లాడిన తీరు జపాన్‌లోని భారత రాయబారి దీపా వాధ్వాతో పాటు జపానీ పారిశ్రామికవేత్తలను అబ్బురపర్చింది. మైక్రోసాఫ్ట్ మొదలు కియా మోటర్స్ వరకు అనేక బహుళజాతి బ్రాండ్లను రాష్ట్రానికి తెచ్చిన తీరు దౌత్యవేత్తలకు సైతం మార్గదర్శకంగా నిలించింది.

అదే విధంగా, సాధారణంగా రాష్ట్రాల స్థాయి నాయకులను కలవని యూఏఈ అధ్యక్షుడు, అబుధాబి రాజు శేఖ్ మోహమ్మద్ బిన్ జాయద్ కూడ 2018లో చంద్రబాబుతో సమావేశమై తాను నవ్యాంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెడుతానని చెప్పినా ఆ తర్వాత ప్రభుత్వ మార్పిడితో అడుగు ముందుకు పడలేదు.

ఆర్థిక ప్రయోజనాలే కాకుండ సగటు ప్రవాసీయుల సమస్యలపై కూడా ఆయన స్పందించారు. గల్ఫ్‌లో మృతదేహాల పెండింగ్ గూర్చి ఈ ప్రతినిధి 1995లో వ్రాసిన ఒక వ్యాసంపై అప్పుడే అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు స్పందించిన తీరు సౌత్ బ్లాక్‌లో కదలిక తీసుకువచ్చింది. ఈ రకమైన దార్శనికత, అంకితభావం కలిగిన చంద్రబాబు నాయుడి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్ళీ అభివృద్ధిబాటపై పయనిస్తుందని ఆశించవచ్చు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ మార్పు ప్రజలు ఆశించిందేనా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఒక అమ్మాయి తన తల్లిదండ్రుల వద్ద ఉన్నంత కాలం స్వేచ్ఛగా, పెద్దగా బరువు బాధ్యతలు లేకుండా ఉంటుంది. అయితే వివాహం చేసుకుని మరో ఇంట్లో అడుగు పెట్టాక అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ఉండవలసి వస్తుంది. అన్నింటినీ ఆకళింపు చేసుకుని తన బాధ్యతలేమిటో అర్థం చేసుకోవల్సి ఉంటుంది. మన వెంకయ్యనాయుడు కూడా ఇప్పటి వరకూ పార్లమెంట్ సభ్యుడుగా, కేంద్రమంత్రిగా అనేక పదవులు నిర్వహించారు. ఉభయ సభల్లోనూ, ఇతర సమావేశాల్లోనూ అనర్గళంగా మాట్లాడారు. కాని ఇప్పుడు ఆయన ఉపరాష్ట్రపతి. అది ఒక రాజ్యాంగ హోదా. రాజ్యసభ ఛైర్మన్‌గా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. కనుక అయన కూడా పుట్టింటి నుంచి మెట్టినింటికి వచ్చినట్లు కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారవలసి ఉంటుంది. అది ఆయనకు తెలుసు' అని 2017 ఆగస్టు మొదటి వారంలో ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడును పార్టీ ఎంపీల సమావేశంలో అభినందిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నప్పుడు హాజరైనవారందరూ నవ్వుల వర్షం కురిపించారు. 'మోదీ ఎంత సహజమైన ఉదాహరణనిచ్చారు!' అని ఒకరిద్దరు వ్యాఖ్యానించారు.

2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 2014 నుంచి ఇప్పటి వరకూ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నరేంద్రమోదీ కూడా ఇప్పుడు ఒక కొత్త వాతావరణంలోకి అడుగుపెట్టారు. ఇప్పటి వరకూ ఆయన సారథ్యంలో బీజేపీ ఎన్నిసార్లు పోటీ చేసినా అన్నిసార్లు అత్యధిక మెజారిటీ సాధించింది. 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నా, 10 సంవత్సరాలు దేశ ప్రధానమంత్రిగా ఉన్నా ఎప్పుడూ ఇతర పార్టీల బలంపై ఆధారపడవలసిన అవసరం ఆయనకు రాలేదు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏకు పూర్తి మెజారిటీ వచ్చినా, ఆయన స్వంత పార్టీ బీజేపీకి పూర్తి సంఖ్యాబలం రాలేదు. ఎన్నికలకు ముందే ఒక కూటమిగా ఏర్పడిన ఎన్డీఏకు సారథిగా కూడా మోదీయే ఉన్నందువల్ల ఆయన నాయకత్వానికి వచ్చిన ఢోకా ఏమీ లేదు కాని ఒక రకంగా గత 23 సంవత్సరాల ఆయన అనుభవంతో పోలిస్తే ఇప్పుడు ఆయన నిర్వహించేది కొత్త సంసారమే అని చెప్పక తప్పదు. ఎందుకంటే గతంలో మోదీ ఎప్పుడూ సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించలేదు.

అయితే 1999–2004 మధ్య అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలో బీజేపీ ఏర్పర్చిన సంకీర్ణ ప్రభుత్వానికీ, ఇప్పుడు మోదీ నాయకత్వంలో ఏర్పాటు చేసిన సంకీర్ణ ప్రభుత్వానికీ కొన్ని పోలికలు ఉన్నాయి. నిజానికి అప్పుడు ఎన్డీఏ ఇప్పటి ఎన్డీఏ కంటే ఆరు సీట్లు ఎక్కువ సాధించింది. కాంగ్రెస్ ప్రధానుల తర్వాత అయిదేళ్లు పాలించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా గుర్తింపు పొందిన వాజపేయి సారథ్యంలో నాడు ఎన్డీఏకు 299 సీట్లు రాగా ఇప్పుడు మోదీ సారథ్యంలోని ఎన్డీఏకు 293 సీట్లు లభించాయి. నాడు కూడా కాంగ్రెస్ కేవలం 112 సీట్లతో చాలా బలహీనంగా ఉండేది. 1999లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాల సంఖ్యాబలం 134 మాత్రమే. ఇప్పుడు 232 సీట్లు సాధించిన ఇండియా కూటమి కంటే ఈ బలం ఎంతో తక్కువ. బీజేపీకి రెండుసార్లు మెజారిటీ సాధించి పెట్టి పదేళ్లు ప్రభుత్వాన్ని తిరుగులేకుండా నిర్వహించిన మోదీ ఇప్పటికే చరిత్రలో నిలిచిపోయారు. అయితే ఒక సంకీర్ణ ప్రభుత్వానికి సారథిగా అయిదేళ్లు పాలనను నిర్వహించిన పీవీ, వాజపేయి, పదేళ్ల పాటు యూపీఏ ప్రభుత్వాన్ని నిర్వహించిన మన్మోహన్ సింగ్ కూడా చరిత్రలో నిలిచిపోయిన నాయకులే. జాతీయ స్థాయిలో మెజారిటీ సంఖ్యాబలంతో ప్రభుత్వాన్ని పదేళ్లు నిర్వహించిన వ్యక్తే సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించవలసి వచ్చిన ఉదంతాలు భారతదేశంలో లేవు. అయినప్పటికీ మోదీ ఈ బాధ్యతను అవలీలగా నిర్వహిస్తారన్న విషయంలో అనుమానాలు అక్కరలేదు. అందుకు అనేక కారణాలున్నాయి.

ఒకటి, ఎన్డీఏలో బీజేపీ ఇప్పుడు 240 సీట్లు సాధించిన బలమైన పక్షం. కేవలం 32 సీట్లు అదనంగా ఉంటే చాలు ఆయన మెజారిటీకీ ఢోకా ఉండదు. పైపెచ్చు వాజపేయి లాగా ఆయనకు ఎన్డీఏలో బలమైన మద్దతు ఉన్నది. అప్పుడు 29 సీట్లతో మెజారిటీ మిత్రపక్షంగా తెలుగుదేశం, ఆ తర్వాత 20 సీట్లతో జేడీ (యు), డీఎంకే వంటి ఇతర పార్టీలు మద్దతునిచ్చినందువల్ల వాజపేయి అయిదేళ్లు తనదైన శైలిలో పాలనను నిర్వహించారు. ఇప్పుడు కూడా తెలుగుదేశం, జనతాదళ్ (యు)తో పాటు ఇతర పార్టీలు మోదీకి ఎన్నికల ముందే మద్దతు ప్రకటించి, బీజేపీతో పాటు మెజారిటీ సీట్లు గెలుచుకున్నాయి. అంతేకాక, ఇండియా కూటమికి 232 సీట్లు లభించినప్పటికీ అది పలు పార్టీల సముదాయం. అది ఏ కోశానా ఈ అయిదేళ్లలో మోదీ ప్రభుత్వానికి ఢోకా కల్పించే అవకాశాలు లేవు. ఒకసారి 145, రెండోసారి 206 సీట్లు సాధించిన కాంగ్రెసే పదేళ్ల పరిపాలన నిర్వహించగలిగినప్పుడు 240 సీట్లు సాధించిన మోదీ ఎందుకు సమర్థంగా పరిపాలన నిర్వహించలేరు?

అతి కష్టమ్మీద వంద సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ మరో 30, 40 సీట్లను అదనంగా సాధించి ఉంటే పరిస్థితులు వేరుగా ఉండేవి. కాని ప్రజలు భిన్నంగా తీర్పునిచ్చారు. ప్రతిపక్షాలను బలంగా ఏకం చేయగలిగిన జయప్రకాశ్ నారాయణ్, సూర్జిత్ వంటి నేతలు లేనందువల్ల అది కలిసికట్టుగా పోటీ చేయలేకపోయింది. నాయకత్వ లోపం స్పష్టంగా కనిపించినప్పటికీ కాంగ్రెస్, ఇతర పక్షాలు సామాజిక సమీకరణలు తమకు అనుకూలంగా మారేందుకు గట్టిగానే కృషి చేశాయని చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన వందకు పైగా ఎంపీల్లో 37 మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారు కావడం గమనార్హం. వీరిలో అత్యధికులు 50 శాతం పైగా ఓట్లను సాధించారు. ఆశ్చర్యకరమేమంటే 5 జనరల్ సీట్లలో ఈ వర్గాలు గెలిచాయి. క్రమంగా కాంగ్రెస్ తన మూలాల్లోకి ప్రవేశిస్తున్న దనడానికి ఇది ఉదాహరణ. ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో కేవలం అయిదు సీట్లు సాధించిన సమాజ్‌వాదీ పార్టీ ఈ సారి 37 సీట్లు సాధించడానికి ప్రధాన కారణం పెద్ద సంఖ్యలో దళితులు కూడా బీఎస్పీని వదిలి ఎస్పీ వైపు మొగ్గుచూపడం. యూపీలో ఇండియా కూటమికి యాదవ, ముస్లిం ఓట్లు సంఘటితం కావడం మాత్రమే కాక దళితులు కూడా అధిక సంఖ్యలో మద్దతునీయడం బీజేపీ విస్మరించదగిన పరిణామం కాదు. బీజేపీ గతంలో 224 సీట్లలో 50 శాతం పైగా ఓట్లను సాధిస్తే ఈ సారి కేవలం 156 సీట్లలోనే 50 శాతం పైగా ఓట్లు సాధించడం కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన విషయమే.



ఎన్డీయే భారతీయ ఆత్మ అని ప్రకటించిన మోదీ, జాతీయ ప్రయోజనాలతో ప్రాంతీయ ఆకాంక్షలు ముఖ్యమని చెప్పిన చంద్రబాబు అభివృద్ధి ఎజెండాలు పరస్పరం భిన్నమైనవి కావు. వారిద్దరి ఎజెండా ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ఎజెండాకు భిన్నంగా ఏమీ లేదు. అందుకు ప్రత్యామ్నాయ ఎజెండా ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. ప్రజల తీర్పుకు అనుగుణంగా వ్యవహరించడం మంచిదని గ్రహించినందువల్లనేమో ఎన్డీఏ నేతల మధ్య సఖ్యత చాలా సహజంగా కనిపిస్తోంది.

బిహార్‌లో నితీశ్, చిరాగ్ పశ్వాన్, జితన్ రాంమాంఝీ వంటి సామాజిక శక్తులు లేకపోతే ఇవాళ ఆ రాష్ట్రంలో ఎన్డీఏ మెజారిటీ సీట్లు సాధించగలిగేది కాదనేది స్పష్టం. బహుశా ఈ విషయం గమనించినందువల్లే మోదీ యూపీ, బిహార్‌కు కేంద్ర కేబినెట్‌లో అత్యధిక మంత్రి పదవులు కల్పించి ఉండవచ్చు.

అయితే కాంగ్రెస్ విజయంతో ఆ పార్టీ నేతలు ఉబ్బితబ్బిబ్బు కానక్కర్లేదు. 2019లో కంటే అది కేవలం రెండున్నరశాతం ఓట్లను అధికంగా సాధిస్తే, బీజేపీ ఒక శాతం కంటే తక్కువ ఓట్లను కోల్పోయింది. సామాజిక న్యాయ ఎజెండాతో ఎన్నికల్లో ప్రవేశించిన ఇండియా కూటమి ఈ ఎజెండాను అన్ని చోట్లా ప్రజల్లోకి తీసుకువెళ్లలేకపోయినందువల్ల అనుకున్న ఫలితాలను సాధించలేకపోయింది. తెలంగాణలాంటి చోట్ల బీజేపీ ఉధృతిని అరికట్టలేకపోయింది. దాదాపు 40 శాతం మేరకు దళితులు, ఆదివాసీలు ఉన్న ఒడిషాలో బిజూజనతాదళ్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీని ఆదరిస్తున్న విషయం తెలిసినప్పటికీ కాంగ్రెస్ ప్రేక్షక పాత్ర పోషించింది. 35 శాతం దళితులు, ఆదివాసీలు ఉన్న మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతున్నా, ఆపగలిగే నేతలు ఆ పార్టీలో లేరు. ఛింద్వారా వంటి కాంగ్రెస్ కంచుకోటలో కూడా బీజేపీ విజయం సాధించింది.

సామాజిక పరిస్థితులు పూర్తిగా పరిపక్వం కాకుండా సమాజంలో ఏ మార్పూ సంభవం కాదని. మార్పుకు దోహదం చేసే శక్తులు ఇంకా బలహీనంగా ఉన్నాయని ఈ ఎన్నికలు నిరూపించాయి. అందువల్లే బహుశా భారత ప్రజలు మోదీని పూర్తిగా తిరస్కరించాలని అనుకోలేదని రుజువయింది. మోదీ ఆకర్షణ, ఆయన భావజాలం, ఆయన హావభావాలు, విన్యాసాలు ఆయన పట్ల ప్రజల్లో పూర్తిగా వికర్షణ కల్పించలేకపోయాయి. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ఆయనకు కూడా ఒక సందేశాన్ని ఇచ్చాయనడంలో అతిశయోక్తి లేదు. ఈ ప్రజాస్వామిక పోరు పూర్తిగా మోదీ పేరుపైనే జరిగినందువల్ల ఎన్నికల ఫలితాలు కూడా ప్రజలు మోదీని దృష్టిలో ఉంచుకున్నవే అని చెప్పక తప్పదు. ఆ విషయం గ్రహించినందువల్లే మోదీ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచీ పూర్తిగా మారిపోయినట్లు వ్యవహరిస్తున్నారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేయడానికి బదులు నేరుగా ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి తన నివాసంలోనూ, సెంట్రల్ హాలులోను చంద్రబాబు పక్కన కూర్చుని చెణుకులు విసురుతూ, నవ్వుతూ వ్యవహరించిన తీరు, మిత్రపక్షాల పట్ల ప్రదర్శించిన స్నేహశీలత విస్మరించదగిన దృశ్యాలు కావు. ఎన్డీయే భారతీయ ఆత్మ అని ప్రకటించిన మోదీ, జాతీయ ప్రయోజనాలతో ప్రాంతీయ ఆకాంక్షలు ముఖ్యమని చెప్పిన చంద్రబాబు అభివృద్ధి ఎజెండాలు పరస్పరం భిన్నమైనవి కావు. వారిద్దరి ఎజెండా ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ఎజెండాకు భిన్నంగా ఏమీ లేదు. అందుకు ప్రత్యామ్నాయ ఎజెండా ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. ప్రజల తీర్పుకు అనుగుణంగా వ్యవహరించడం మంచిదని గ్రహించినందువల్లనేమో ఎన్డీఏ నేతల మధ్య సఖ్యత చాలా సహజంగా కనిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

బీజేపీ ఎలా ఓడిపోయింది?

తీర్పు 2024 — 2



■ యోగేంద్ర యాదవ్

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పాలక పక్షం భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పుగా అర్థం చేసుకోవడం సబబేనా? సబబేనని మాలో ఒకరు (యోగేంద్ర యాదవ్) గట్టిగా వాదించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సంఖ్యా బలం ఎన్డీఏకు సమకూరింది. అయితే బీజేపీ తన మెజారిటీని కోల్పోవడమే కాదు, ప్రజామోదాన్ని పొందడంలో కూడా విఫలమయింది. ప్రత్యర్థి పక్షం ఏదీ తన దరి దాపుల్లోకి రాని రీతిలో ఏకైక పెద్ద పక్షంగా బీజేపీ ఆవిర్భవించింది. అయితే 400కి పైగా సీట్లను గెలవాలని, 50 శాతానికి పైగా ఓట్లను కైవసం చేసుకోవాలని స్వయంగా నిర్దేశించుకున్న లక్ష్యాల వెలుగులో బీజేపీ సంఖ్యా బలాన్ని పరిశీలించవలసి వున్నది. అంతకంటే ముఖ్యంగా ఎన్నికల ఫలితాలను వాటి రాజకీయ సందర్భంలో చూడవలసి ఉంది. ఈ సార్వత్రిక ఎన్నికలలో ధన బలం, మీడియా మద్దతు, ప్రభుత్వ యంత్రాంగం, మరీ ముఖ్యంగా ఎన్నికల సంఘం మొదలైనవన్నీ ప్రతిపక్షానికి వ్యతిరేకంగా ఉన్నాయన్న కఠోర వాస్తవం నేపథ్యంలో బీజేపీ జయాపజయాలను అంచనా వేయవలసి ఉంది.

ఈ అవగాహనకు ఒక సంభావ్య వ్యతిరేక వాదన బీజేపీ ఓట్ల వాటా కథ. పాలక పక్షం ఓట్ల వాటా 37.4 శాతం నుంచి 36.6 శాతానికి మాత్రమే పడిపోయింది. నిజానికి ఇది ఉపేక్షణీయమైనది. ఒడిషాలో బీజేపీ ఆశ్చర్యకరంగా జయపతాక నెగుర వేసింది. కేరళలో పలు అవరోధాలను అధిగమించి తన ఉనికిని నెలకొల్పుకున్నది. ఆంధ్ర, పంజాబ్‌లలో తన ఉనికిని మెరుగు పరచుకున్నది. మొత్తం మీద దేశవ్యాప్తంగా తన ఉనికిని సుస్థిర పరచుకోవడంలో బీజేపీ పూర్తిగా సఫలమయింది అన్ని రాష్ట్రాలలోను రెండంకెల శాతంలో ఓట్ల వాటాను సాధించుకున్నది. ఈ వాస్తవాల ప్రాతిపదికన సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ విజయం సాధించిందని ఆ పార్టీ మద్దతుదారులు వాదిస్తున్నారు. స్వతంత్ర పరిశీలకులు వారితో ఏకీభవించడం లేదు.

రాష్ట్ర స్థాయి ఓట్ల వాటాలను నిశితంగా పరిశీలిస్తే పాలక పక్షాలు కొన్ని ప్రాంతాలలో ఓడిపోయి, మిగతా ప్రాంతాలలో లబ్ధి పొందిన కథ కాదని అర్థమవుతుంది. నిజానికి బీజేపీ పాలక పక్షంగా లేని ప్రతి చోటా ఓటర్లు అక్కడి పాలకపక్షానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ సార్వత్రిక ఎన్నికలలో రెండు విభిన్న బీజేపీలు పోటీ చేశాయి. ఒకటి పాలకపక్ష బీజేపీ, రెండు ప్రతిపక్ష బీజేపీ. పాలకపక్ష బీజేపీ ఈ ఎన్నికలలో తీవ్రంగా నష్టపోగా సవాల్‌దార్ బీజేపీ గణనీయంగా లబ్ధి పొందింది. పాలకపక్షాలు, రాజకీయ ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా వేసిన ఓటుతో కొన్ని రాష్ట్రాలలో బీజేపీ బాగా లబ్ధి పొందింది. అయితే బీజేపీకి దక్కిన ఈ లబ్ధి జాతీయ స్థాయిలో ప్రజా తీర్పు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉందన్న వాస్తవాన్ని పాక్షికంగా కప్పిపుచ్చింది దీని వల్ల బీజేపీ దీర్ఘకాలిక లబ్ధి పొందే అవకాశం లేదు.

దేశ వ్యాప్తంగా మూడింట రెండు వంతుల నియోజకవర్గాలలో (కచ్చితంగా చెప్పాలంటే 356 సీట్లు) బీజేపీ ప్రాబల్య రాజకీయ పక్షంగా ఉన్నది. రాష్ట్ర పాలక పక్షంగా లేని చోట్ల కూడా అది ఆధిపత్య పార్టీగా ఉన్నది. బీజేపీ ప్రాబల్య నియోజక వర్గాలు పశ్చిమాన మహారాష్ట్ర, గుజరాత్ నుంచి తూర్పున బిహార్, జార్ఖండ్ దాకా విస్తరించి వున్నాయి. బీజేపీ ప్రస్తుతం పాలకపక్షంగా లేని కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లు కూడా ఈ పరిధిలోకి వస్తాయి. ఈ రాష్ట్రాలలో తీవ్ర నష్టాలను చవిచూసింది. దాని రాజకీయ గుత్తాధిపత్యానికి తీవ్ర విఘాతమేర్పడింది. గత సార్వత్రిక ఎన్నికలలో గెలుచుకున్న 271 నియోజకవర్గాలలో 75ను ఈ సారి కోల్పోయింది అయితే మిగతా రాష్ట్రాలు, ప్రాంతాలలో (187 సీట్లు) బీజేపీ పాలక పక్షాల, రాజకీయ ఆధిపత్య వర్గాల వ్యతిరేక శక్తిగా ఎన్నికల గోదాలోకి దిగింది. అధికారంలో ఉన్న లేదా ప్రాబల్య రాజకీయ పక్షాలను సవాల్ చేసింది. ఒడిషాలో బిజూ జనతాదళ్, ఆంధ్రలో వైసీపీ, బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని బీజేపీ సవాల్ చేసింది. ఇలా ఆయా రాష్ట్రాలలోని పాలక పక్షాలను సవాల్ చేయడం ద్వారా బీజేపీ లబ్ధి పొందింది. ఈ 187 సీట్లలో గతంలో గెలుచుకున్న వాటి కంటే ఈ సారి 12 సీట్లను అదనంగా కైవసం చేసుకున్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే బీజేపీకి 6 శాతం ఓట్లు పెరిగాయి. ఈ మొగ్గు జాతీయ స్థాయిలో ఓట్ల వాటా తగ్గుదలను 1 శాతం మేరకు నివారించింది.

బీజేపీ ఓట్ల వాటా పైకి కనిపించిన దాని కంటే అధ్వాన్నంగా ఉన్నది. 2019లోను, 2024లోను పోటీ చేసిన నియోజకవర్గాలు 399 ఉన్నాయి. వీటిలో 274 నియోజకవర్గాలలో ఓట్ల శాతం బాగా పడిపోయింది. మహారాష్ట్ర, రాజస్థాన్, బిహార్, జార్ఖండ్, హర్యానా, హిమాచల్, పంజాబ్, జమ్ము–కశ్మీర్‌లలో బీజేపీ పోటీ చేసిన అన్ని నియోజకవర్గాలలోను ఆ పార్టీ ఓట్ల వాటా తగ్గిపోయింది. యూపీలో రెండు స్థానాలలో మినహా మిగతా నియోజకవర్గాలు అన్నిటిలోను బీజేపీ ఓట్ల వాటా గణనీయంగా తగ్గింది 20 శాతానికి పైగా ఓట్లతో గెలిచిన స్థానాల సంఖ్య 151 నుంచి 77కి తగ్గిపోయింది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముఖాముఖీ పోటీ జరిగిన 215 స్థానాలలో బీజేపీకి పడిన ఓట్ల పెరుగుదలను చూద్దాం. గత సార్వత్రిక ఎన్నికలలో ఈ నియోజకవర్గాలలో 90 శాతానికి పైగా కైవసం చేసుకున్నది. ఈ సారి బీజేపీ 153 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. 62 స్థానాలను కాంగ్రెస్‌కు కోల్పోయింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఈ నియోజకవర్గాలలో బీజేపీ వ్యతిరేక ఓట్లు 5.5 శాతం పెరిగాయి. ఇది బీజేపీకి తీవ్ర పరాజయమని చెప్పక తప్పదు.

బీజేపీ పాలకపక్షంగా ఉన్న రాష్ట్రాలలో ఆ పార్టీ పోటీ చేసిన స్థానాలలో దానికి వ్యతిరేకంగా పడిన ఓట్ల శాతం గణనీయమైన స్థాయిలో ఉన్నది. ఈ నెగెటివ్ ఓటు రాజస్థాన్‌లో 12 శాతం, హర్యానాలో 12 శాతం, హిమాచల్‌లో 13 శాతం మేరకు ఉన్నది. ఇదే రాష్ట్రాలలో బీజేపీ గత అసెంబ్లీ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలుపొందింది. అయితే ప్రస్తుత ఎన్నికలలో రాజస్థాన్, హర్యానాలలోని కొన్ని ప్రాంతాలలో బీజేపీ పట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగిపోవడంతో ఆ పార్టీ గణనీయమైన సంఖ్యలో సీట్లను కోల్పోయింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ తీవ్రంగా నష్టపోయింది ఈ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా పడిన ఓట్ల శాతం (6.8శాతం), దాని ఇరుగు పొరుగు రాష్ట్రాలలో నమోదైన బీజేపీ వ్యతిరేక ఓటుతో ఇంచుమించు సమరీతిలో ఉండడం గమనార్హం. బీజేపీ వ్యతిరేక ఓటు బిహార్‌లో 6.9 శాతం మేరకు, జార్ఖండ్‌లో అది 7 శాతం మేరకు ఉన్నది.

బీజేపీ ఓట్ల వాటాలో స్వల్పస్థాయి తగ్గుదల కర్ణాటక, అస్సాం, ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లో చోటుచేసుకున్నది. ఈ అన్ని రాష్ట్రాలలో (కర్ణాటక మినహా) పాలకపక్షం తన సీట్లను చాలావరకు కాపాడుకోగలిగింది. కర్ణాటకలో బీజేపీ వ్యతిరేక ఓటు కొన్ని ప్రాంతాలలో మాత్రమే కేంద్రీకృతమైనప్పటికీ బీజేపీ చాలా సీట్లను కోల్పోయింది. పాలకపక్ష బీజేపీ నష్టపోని రాష్ట్రాలు గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మాత్రమే. ఈ రాష్ట్రాలలో ప్రతిపక్షం బలహీనంగా ఉండంతో బీజేపీ లబ్ధి పొందింది. బీజేపీ ఓట్లను కొల్లగొట్టడంలో ప్రతిపక్షం పూర్తిగా విఫలమయింది.

బీజేపీ ప్రతిపక్ష పాత్ర నిర్వహించిన రాష్ట్రాలలో పాలకపక్షాల పట్ల వ్యతిరేకత జాతీయ పాలకపక్షానికి సానుకూలంగా పరిణమించింది. తెలంగాణలో బీఆర్ఎస్ పరోక్ష మద్దతు కారణంగా బీజేపీ తన ఓట్ల వాటాను 15.7 శాతం మేరకు అదనంగా పెంచుకున్నది. ఒడిషాలో 7 శాతం అదనపు ఓట్ల పెరుగుదలతో అత్యధిక లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడంతో పాటు ఆ రాష్ట్రంలో అధికార పీఠాన్ని కూడా కైవసం చేసుకుంది. కేరళలో 3 శాతం అదనపు ఓట్ల పెరుగుదలతో ఆ రాష్ట్రంలో తన మొదటి లోక్‌సభా స్థానాన్ని బీజేపీ గెలుచుకున్నది. తమిళనాడు, పంజాబ్‌లలో ఒక కీలక భాగస్వామ్య పక్షాన్ని కోల్పోయిన కారణంగా ఆ మాజీ మిత్రపక్షానికి అనుకూలంగా ఉండే సామాజికవర్గాల మద్దతును బీజేపీ కోల్పోయింది. ఆ రాష్ట్రాలలో గతంలో కంటే ఎక్కువ సీట్లలో పోటీ చేసిన కారణంగా బీజేపీ తన ఓట్ల వాటాను మొత్తంగా పెంచుకున్నప్పటికీ విడివిడి నియోజకవర్గాలలో దాని ఓట్ల వాటా స్వల్పంగా తగ్గిపోయింది. ఈ ధోరణికి పశ్చిమ బెంగాల్ ఒక మినహాయింపుగా కనిపిస్తున్నది. ఈ రాష్ట్రంలో పాలక తృణమల్ కాంగ్రెస్‌ను బీజేపీ గట్టిగా ఎదుర్కొన్నది. అయితే ఓట్ల వాటాలో 1.3 శాతాన్ని కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికలలో ఎదురైన పరాజయం నుంచి బీజేపీ ఇప్పటికీ కోలుకోలేదని ఆ ఓట్ల వాటా తగ్గుదల స్పష్టం చేసింది.

భారతీయ జనతా పార్టీ ప్రజామోదాన్ని పొందిందా అన్నది ఈ సార్వత్రిక ఎన్నికల అసలు ప్రశ్నగా చెప్పి తీరాలి. 400కు పైగా సీట్లను, 50 శాతానికి పైగా ఓట్లను గెలుచుకోవాలన్న లక్ష్యాన్ని బీజేపీ తనకుతాను నిర్దేశించుకున్నది. ఆ రికార్డు స్థాయి సీట్లు, ఓట్లు సాధిస్తాననే ఆత్మవిశ్వాసాన్ని ఆ పార్టీ పదేపదే వ్యక్తం చేసింది. ఎన్నికల షెడ్యూలును ప్రకటించక ముందే బీజేపీనే మళ్లీ విజేత అని సర్వత్రా భావించడం జరిగింది. ఆ పార్టీ శ్రేణులకైతే ఈ విషయంలో ఇసుమంత సందేహం కూడా లేదు. బీజేపీ ప్రత్యర్థి పక్షాల సంఖ్యా బలం గురించి ఎవరూ పట్టించుకోలేదు. బీజేపీ మిత్రపక్షాల సంఖ్యా బలంపై కూడా ఎవరూ శ్రద్ధ చూపలేదు మోదీ, ఆయన పార్టీ కేంద్రంగా జరిగిన అధికార క్రీడలో ఆ అంశాలన్నీ యాదృచ్ఛికమైనవేనని భావించడం జరిగింది. బీజేపీ భవిష్యత్తుకు సంబంధించిన నిజమైన ప్రశ్న: పాలకపక్ష బీజేపీని ప్రతిపక్ష బీజేపీ ఎలా రక్షించగలుగుతుంది? బీజేపీ ఎదుగుదలకు ఆస్కారమున్న రాష్ట్రాలు ఇప్పుడు ఎన్నో లేవు. వివిధ రాష్ట్రాలలో పాలకపక్షాలను సవాల్ చేసిన రాజకీయ శక్తిగా బీజేపీకి సమకూరిన సానుకూలతలు సుదీర్ఘకాలం పాటు కొనసాగవు. ఇది స్పష్టం. వెన్వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో, కాంగ్రెస్‌కు పట్టిన గతి తనకు పట్టకుండా ఉండేందుకు దోహదం చేసే మార్గాలను పాలకపక్ష బీజేపీ కనుగొనవలసి ఉన్నది. పైగా నరేంద్ర మోదీ ప్రజాకర్షణ శక్తి క్షీణించిపోతున్న తరుణమిది. తిరుగులేని భవిష్యత్తును నిర్మించుకునే విషయంలో బీజేపీకి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు అంతగా నమ్మకాన్ని, భరోసాను ఇవ్వలేవు.

భారతీయ జనతా పార్టీ ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో, పాలకపక్షంగా ఉన్న రాష్ట్రాలలో తీవ్ర నష్టాలను చవిచూసింది. పాలకపక్షాలుగా ఉన్న ప్రత్యర్థి పార్టీలను సవాల్ చేసిన రాష్ట్రాలలో గణనీయమైన లబ్ధి పొందింది. వెన్వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో, కాంగ్రెస్‌కు పట్టిన గతి తనకు పట్టకుండా ఉండేందుకు దోహదం చేసే మార్గాలను బీజేపీ కనుగొనవలసి ఉన్నది. పైగా నరేంద్ర మోదీ ప్రజాకర్షణ శక్తి క్షీణించిపోతున్న తరుణమిది. తిరుగులేని భవిష్యత్తును నిర్మించుకునే విషయంలో బీజేపీకి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు అంతగా నమ్మకాన్ని, భరోసాను ఇవ్వలేవు.



(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఐదు వ్యాసాల పరంపరలో ఇది రెండవది)

ఆంధ్రజ్యోతి
బుధవారం • 12 జూన్ 2024
నవ్య
కుటుంబ కదంబం
5

ఫ్యాషన్



వర్షాకాలం వేసుకునే రెయిన్ కోట్స్ ఆకర్షణీయమైన రంగుల్లో, అందమైన మోడళ్లలో తయారవుతున్నాయి. వేసుకునే దుస్తులకు తగ్గట్టు రకరకాల మోడల్స్‌లో దొరుకుతున్న రెయిన్ కోట్స్ మీద ఓ లుక్కేద్దామా?

లవ్లీ రెయిన్‌కోట్స్

సాధారణంగా రెయిన్ కోట్స్ పాలియెస్టర్, రెయాన్ మెటీరియల్స్‌తో తయారవుతూ ఉంటాయి. నైలాన్‌తో పోలిస్తే పాలియెస్టర్ మెటీరియల్ తడిని సమర్థంగా ఆపుతుంది. అలాగే రెయిన్‌కోట్స్ డిజైన్ ఆధారంగా వాటికి వేర్వేరు పేర్లు కూడా ఉన్నాయి.

పాంచో రెయిన్‌కోట్: ఈ రెయిన్‌కోట్ ప్లాస్టిక్‌తో తయారవుతుంది. తేలికగా ఉండే ఈ రెయిన్‌కోట్‌ను సునాయాసంగా మడత పెట్టేసి, వెంట తీసుకెళ్లిపోవచ్చు.

పాకెట్ రెయిన్‌కోట్: రెయిన్‌కోట్ కోసం ప్రత్యేకమైన సంచిని కేటాయించ లేనివాళ్లు, ఉపయోగించని సమయాల్లో దాన్ని భద్రంగా దాచాలనుకునేవాళ్లకు అనువైన రెయిన్ కోట్ ఇది. లైట్ వెయిట్, రీయూజబుల్ మెటీరియల్‌తో తయారయ్యే ఈ రెయిన్‌కోట్‌ను చిన్నపాటి పౌచ్‌లో, లేదా జేబులో దాచేయవచ్చు.

వాటర్ ప్రూఫ్ రెయిన్‌కోట్: వాటర్‌ప్రూఫ్ రెయిన్‌కోట్స్, వాటర్ రిపెల్లెంట్ రెయిన్‌కోట్స్ కంటే మంచివి. వాటర్ రిపెల్లెంట్ రెయిన్ కోట్స్ తయారీలో నీటిని అంటుకోనివ్వకుండా చేసే రసాయనాలను ఉపయోగిస్తారు. కాబట్టి వాటర్ ప్రూఫ్ తరహా రెయిన్‌కోట్స్‌నే ఎంచుకోవాలి.



క్రీ.శ 1200వ శతాబ్దంలో అమేజాన్ ప్రాంతాల్లో మొట్టమొదటిసారిగా రెయిన్‌కోట్స్‌ను ఉపయోగించిన చారిత్రక ఆధారాలున్నాయి. పాలను పోలిన జిగట పదార్థంతో (రబ్బర్ చెట్ల జిగురు) అప్పట్లో రెయిన్‌కోట్లను తయారుచేసేవారు. యూరోపియన్లు, అన్వేషకులు, అమెరికాస్‌కు ప్రయాణించినప్పుడు, వాన నీళ్లకు తడిచిపోకుండా కాపాడే ఈ రెయిన్‌కోట్లను వాళ్లు కనుగొన్నారు. అమేజాన్ ప్రాంత ప్రజలు రబ్బరు పాలతో రెయిన్‌కోట్లను తయారుచేసుకున్న విధానాన్ని, యూరోపియన్లు, 1700 శతాబ్దంలో కనిపెట్టగలిగారు. అలా అప్పటి నుంచి మెరుగైన రెయిన్‌కోట్ల తయారీ పరిశోధనలు మొదలయ్యాయి. 1824లో, స్కాట్‌ల్యాండ్ కెమిస్ట్, మొట్టమొదటి ఆధునిక రెయిన్‌కోట్‌ను తయారుచేశాడు. దాని తయారీకి ఉపయోగించిన టార్పాలిన్ వస్త్రాన్ని, ఇండియన్ రబ్బర్ క్లాత్ అని అతను సంబోధించేవాడు. అలా అప్పటి నుంచి రెయిన్‌కోట్లు ఎన్నో మార్పులకు గురవుతూ, ఫ్యాషన్ ప్రపంచంలో సైతం ఉనికిని చాటుకోగలిగే స్థాయికి ఎదిగాయి.

విన్నర్

మట్టి కోట మహారాణి

రికార్డులు బద్దలు కొట్టడం ఆమెకు కొత్త కాదు.
పంథొమ్మిదేళ్ల వయసులోనే 'రొలాండ్ గారోస్'ను ముద్దాడింది.
దిగ్గజాలు తలపడే గ్రాండ్‌స్లామ్‌ల్లో విజయాలూ తక్కువేం లేవు.
నాలుగేళ్లలో ఐదు టైటిళ్లు సాధించింది.
ఇప్పుడు... వరుసగా మూడోసారి 'ఫ్రెంచ్ ఓపెన్' నెగ్గి...
మట్టి కోట మహారాణిగా పూలాభిషేకం అందుకొంటోంది.
పోలెండ్ టెన్నిస్ సంచలనం... ప్రపంచ నెంబర్ వన్...
23 ఏళ్ల ఇగా స్వియాటెక్ జైత్రయాత్ర ఇది...



రాకెట్ పట్టి... టెన్నిస్ కోర్టులో అడుగుపెట్టే ఎవరైనా కనే ఒకే ఒక్క కల... గ్రాండ్‌స్లామ్ టైటిల్. మహామహులు తలపడే ఈ మహాసంగ్రామంలో ప్రతి గెలుపు వెనుకా స్ఫూర్తి నింపే జీవిత కథలు ఎన్నో ఉంటాయి. అలుపెరుగని కృషి, పట్టుదల ఉంటాయి. అలాంటి ఒక కథే ఇగా స్వియాటెక్‌ది. పోలెండ్ దేశం వార్సాలో పుట్టింది. ఆమె తండ్రి టోమజ్ కూడా క్రీడాకారుడే. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో జాతీయ రోయింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. తల్లి డొరోటా వైద్యురాలు. అక్క అగట డెంటిస్ట్. తన ఇద్దరు కూతుళ్లను క్రీడాకారులుగా చూడాలనేది టోమజ్ ఆకాంక్ష. దానికి తగినట్టుగానే అగట స్విమ్మింగ్ మొదలుపెట్టింది. కొన్ని కారణాలవల్ల కొన్నాళ్లకు టెన్నిస్‌ను ఎంచుకుంది. అక్కను చూసి స్వియాటెక్ టెన్నిస్ రాకెట్ పట్టుకుంది. ఎందుకంటే అక్కను ఓడించాలని. అయితే ఐటీఎఫ్ జూనియర్ సర్క్యూట్ వరకు పోటీపడిన అగట... గాయాల కారణంగా పదిహేనేళ్ల వయసులో ఆట నుంచి తప్పుకుంది. కానీ స్వియాటెక్ మాత్రం ఎన్ని అవరోధాలు ఎదురైనా పట్టిన రాకెట్ వదల్లేదు. దృఢ సంకల్పంతో ముందుకు సాగింది. పదమూడేళ్లకే ప్రొఫెషనల్ టెన్నిస్ అకాడమీకి వెళ్లి... కఠోర సాధన ప్రారంభించింది.

గెలుపు బాట...

2015 నుంచి ఐటీఎఫ్ జూనియర్ స్థాయిలో పోటీపడిన స్వియాటెక్... ఆ ఏడాది నాలుగు టైటిళ్లు గెలుచుకుంది. ఆ మరుసటి సంవత్సరం జూనియర్ గ్రాండ్‌స్లామ్‌లోకి అడుగుపెట్టి... 'ఫ్రెంచ్ ఓపెన్' డబుల్స్, సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్ వరకు వెళ్లింది. 2018లో కాటీ మెక్‌నలీతో కలిసి 'ఫ్రెంచ్ ఓపెన్' బాలికల డబుల్స్ టైటిల్ సాధించిన స్వియాటెక్... అదే ఏడాది 'వింబుల్డన్' గర్ల్స్ సింగిల్స్ విజేతగా నిలిచింది. అప్పటికి ఆమె కెరీర్‌లో అతిపెద్ద విజయం అది. ఇక నాటి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. ఆ విజయాలు ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో 'డబ్ల్యూటీఏ' (ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్) టూర్‌లో పాల్గొంది. పద్దెనిమిదేళ్ల వయసులో... గ్రాండ్‌స్లామ్స్‌లోకి ప్రవేశించింది. 'ఆస్ట్రేలియన్ ఓపెన్', 'ఫ్రెంచ్ ఓపెన్'లలో పోటీపడింది.

సంచలనాలకు చిరునామా...

సంచలనాలకు చిరునామా... స్వియాటెక్ కెరీర్. 2016 నుంచి 2018 వరకు రెండేళ్ల కాలంలో ఆడిన ఏడు ఐటీఎఫ్ సర్క్యూట్ ఫైనల్స్‌లో ఓటమి ఎరుగని క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. ఒక టోర్నీ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆమె కొట్టిన క్రాస్ కోర్ట్ ఫోర్‌హ్యాండ్ డ్రాప్ షాట్... 'డబ్ల్యూటీఏ షాట్ ఆఫ్ ద ఇయర్' (2019)గా ఎంపికైంది. తొలిసారి 'టాప్ 100'లో చోటు సంపాదించింది. అయితే ఆ తరువాత జరిగిన 'వింబుల్డన్', 'యూఎస్ ఓపెన్', 'కెనడియన్ ఓపెన్'లలో వరుస ఓటములు ఎదురయ్యాయి. కానీ ఆమె నిరాశ చెందలేదు. రెట్టించిన ఉత్సాహంతో... మరింత కఠోర సాధనతో... తిరిగి పుంజుకుంది. తనకంటే మెరుగైన సీడ్స్‌ను మట్టి కరిపిస్తూ... ప్రపంచ మహిళల ర్యాంకింగ్స్‌లో 'టాప్ 50'లోకి దూసుకుపోయింది. అదే సమయంలో కాలి గాయం ఆమెను కొన్నాళ్లు ఆటకు దూరం చేసింది.



హ్యాట్రిక్ కొట్టి...

పాదానికి శస్త్రచికిత్స తరువాత స్వియాటెక్ మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టింది. 54వ ర్యాంకర్‌గా 2020 'ఫ్రెంచ్ ఓపెన్' బరిలోకి దిగిన ఆమె... సంచలన విజయాలు నమోదు చేసింది. 2019 రన్నరప్, ప్రపంచ 19వ ర్యాంకర్ మార్కెటా వోండ్రొసోవాను తొలి రౌండ్‌లో ఇంటికి పంపించిన స్వియాటెక్... నాలుగో రౌండ్‌లో టాప్‌సీడ్, టైటిల్ ఫేవరెట్ సిమోనా హలెప్‌కు షాకిచ్చింది. తద్వారా సిమోనా 17 వరుస విజయాల జైత్రయాత్రకు బ్రేక్ పడింది. అంతిమ పోరులో ప్రపంచ ఆరో ర్యాంకర్ సోఫియా కెనిన్‌ను ఓడించి తొలి గ్రాండ్‌స్లామ్ గెలిచిన పోలెండ్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. అంతేకాదు... 'ఫ్రెంచ్ ఓపెన్' సింగిల్స్ టైటిల్ సాధించిన పిన్న వయస్కురాలిగా రికార్డును తిరగరాసింది. 2022 ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకం. ఆ ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్) ఆమె ఖాతాలో చేరాయి. మరుసటి సంవత్సరం కూడా 'ఫ్రెంచ్ ఓపెన్' సొంతం చేసుకున్న స్వియాటెక్... ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకుంది. గతవారం ముగిసిన టోర్నీ ఫైనల్‌లో 6-2, 6-1తో పన్నెండో సీడ్ పౌలినీని చిత్తు చేసి, మట్టి కోటలో హ్యాట్రిక్ టైటిల్స్ సాధించింది. 'రొలాండ్ గారోస్'లో హెనిన్, మోనికా సెలెస్ తరువాత వరుసగా మూడు టైటిల్స్ గెలిచిన మూడో క్రీడాకారిణి స్వియాటెక్.

అంచనాలు పెరుగుతున్నాయి...

ఇప్పటి వరకు మొత్తం 22 సింగిల్స్ టైటిల్స్ సాధించిన స్వియాటెక్‌పై అంచనాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. 'గత ఏడాది దాదాపు ఆడిన అన్ని టోర్నీలు గెలవడంతో... ప్రతిసారీ అదే స్థాయిలో ఆడగలనని ప్రతిఒక్కరూ ఊహిస్తున్నారు. అది సాధ్యం కాదు. ఎందుకంటే ప్రొఫెషనల్ క్రీడాకారులు అందరూ అద్భుతమైన ప్రతిభ గలవారే. అయితే ఎవరైతే ఒత్తిడి పరిస్థితులను తట్టుకొని మానసికంగా దృఢంగా ఉండగలరో వారే చాంపియన్లు అవుతారు' అంటున్న స్వియాటెక్ ఎక్కడికి వెళ్లినా ఒక స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ను వెంట తీసుకువెళుతుంది. మానసిక ఆరోగ్యానికి ఆమె అంతగా ప్రాధాన్యతనిస్తుంది. 'కెరీర్ ఆరంభం రోజులతో పోలిస్తే నా జీవితం సమూలంగా మారిపోయింది. అయినా ఇవాల్టికీ నేను అదే మనిషిని. నాలో ఎలాంటి మార్పూ రాలేదు. కారణం... మానసిక పరివర్తన. చిన్నప్పటి నుంచి నాతో సైకాలజిస్ట్ ఉంటున్నారు. తను నా క్లిష్ట పరిస్థితులు, అలాగే గెలుపు క్షణాలు దగ్గర నుంచి గమనిస్తుంటుంది. నాకేంకావాలో చెబుతుంది' అంటున్న ఈ పోలెండ్ స్టార్... అపజయాన్నే కాదు, విజయాన్ని ఎదుర్కోవడం కూడా అంత సులువు కాదని చెబుతోంది. ఎంత ఎదిగినా... ఇంటికి ఎన్ని గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలు తీసుకెళ్లినా... స్వియాటెక్‌లో ఇసుమంతైనా గర్వం కనిపించదు. అదే ఆమె ప్రత్యేకత.

> **పుస్తకాలు అద్భుత నేస్తాలు...**
>
> నేను టెన్నిస్ కోర్టులో హోరాహోరీగా పోరాడతాను. దూకుడుగా ఆడతాను. ప్రతి పాయింట్‌నూ, దానికి ప్రేక్షకులు కొట్టే చప్పట్లను ఆస్వాదిస్తాను. కానీ కోర్టు బయటకు వెళితే నేను పూర్తి భిన్నమైన వ్యక్తిని. ప్రశాంతంగా గడపడానికి ఇష్టపడతాను. రణగొణ ధ్వనులు, జనసమర్థమైన ప్రదేశాలు నచ్చవు. ఒంటరిగా కూర్చొని 'నేషనల్ జియోగ్రఫిక్ చానల్' చూస్తుంటాను. పుస్తకాలు బాగా చదువుతాను. ఇవాళ ప్రతిఒక్కరూ సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి గడిపి, విలువైన సమయం వృథా చేస్తున్నారు. పుస్తక పఠనం మరిచిపోయారు. సామాజిక మాధ్యమాలే కాదు... ఖాళీ సమయంలో పుస్తకాలు కూడా అద్భుత నేస్తాలు.

> **ఆటకు ముందు సంగీతం...**
>
> మ్యాచ్‌కు ముందు ఇంపైన సంగీతం ఆస్వాదించడం స్వియాటెక్‌కు అలవాటు మాత్రమే కాదు... సెంటిమెంట్ కూడా. "గన్స్ ఎన్ రోజెస్, లెడ్ జెప్పెలిన్, జానిస్ జోప్లిన్, లెన్నీ క్రావిట్జ్ సంగీతం తరచూ వింటుంటాను. మొదట్లో మ్యాచ్‌లకు ముందు 'వెల్కమ్ టూ జంగిల్' పాప్ సాంగ్స్ వినేదాన్ని. ఎప్పుడూ ఒకే సంగీతం కాకుండా... ఎప్పటికప్పుడు మారుస్తుంటాను. లేకపోతే అది ఒక మూఢనమ్మకంలా మారిపోతుంది" అంటుంది స్వియాటెక్.

చాలామంది జీవితంలో చిన్న పరీక్షలు, ఇబ్బందులు వచ్చినా ఇట్టే డీలా పడిపోతారు. కొందరు మాత్రం ఎన్ని సమస్యలొచ్చినా ముందుకే అడుగులేస్తారు. అలాంటి కోవలోకే అంచల్ భటేజా చెందుతుంది. పదో తరగతి పరీక్షల ముందు కంటిచూపు కోల్పోయిన అంచల్ ఆ తర్వాత అచంచలమైన విశ్వాసంతో లాయరైంది. ఆమె ప్రస్థానమిదే..

స్ఫూర్తిదాయకం.. అంచల్ కథ

ఈ ప్రపంచాన్ని చూడటానికి కళ్లు కావాలి. కళ్లు లేకపోతే ప్రపంచమే లేదు. అంచల్ భటేజాకు కళ్ల జబ్బు ఉందని.. ఎప్పుడైనా కళ్లు కనిపించకుండా పోవచ్చనే విషయం తల్లితండ్రులకు ముందే తెలుసు. కానీ మంచి ఆహారం.. మందులు- ఇలా వీలైనన్ని శ్రద్ధలు తీసుకున్నారు. కానీ 10వ తరగతికి వచ్చేసరికి- అంచల్‌కు దృష్టి మందగించటం మొదలైంది. డాక్టర్ దగ్గరకు వెళ్లే చూపు కోల్పోయే సమయం వచ్చిందని చెప్పారు. 10వ తరగతి పరీక్షల ముందు అంచల్‌కు చూపు పూర్తిగా పోయింది. దానితో తన తరపున పరీక్షలు రాయటానికి సహాయకులను పెట్టుకొని పదో తరగతి పాస్ అయింది. కాలేజీలో కూడా చేరింది. అంచల్‌కు అసలైన సవాలు అప్పుడు ఎదురయింది. సాధారణంగా విన్న విషయాల కన్నా చదివిన విషయాలను మన మెదడు గుర్తుపెట్టుకుంటుంది. అయితే చూపు లేనివారిలో గ్రహణ శక్తి బాగా పెరుగుతుంది. అంచల్ ఇలా తన సామర్థ్యాన్ని పెంచుకోవాలనుకుంది. చూపు లేని వారి కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిలో తయారుచేసిన పుస్తకాలు చదవటం ప్రారంభించింది. ప్రత్యేకమైన రీడింగ్ టూల్స్‌ను నేర్చుకొని ప్రాక్టీసు చేయటం మొదలుపెట్టింది. అందరూ అంచల్ ఏకాగ్రతను చూసి ఆశ్చర్యపోయేవారు. కళ్లు లేవు కాబట్టి పరీక్షలు రాయటానికి ఒక సహాయకుడిని ఇచ్చేవారు. అంచల్ వారి ద్వారా పరీక్షలు రాసేది. ఎంత ఏకాగ్రతతో పరీక్షలు రాసేదంటే- మిగిలిన వారి కన్నా ఆమె అరగంట ముందే సమాధానాలు రాసేది. ఇలాగే పోటీ పరీక్షలు కూడా రాయటం ప్రారంభించింది. కానీ ఆమెకు టెక్నాలజీని ఉపయోగించుకోవటం ద్వారా మరిన్ని మంచి ఫలితాలు ఉంటాయనిపించింది. దీనితో అంధుల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన లాప్‌టాప్‌ను ఉపయోగించటం ప్రారంభించింది. ఈ సమయంలోనే అంచల్- కామన్ లా అడ్మిషన్ టెస్ట్(సీలాట్)ను రాసి బెంగుళూరులోని ప్రతిష్టాత్మకమైన నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్ఐయూ)లో సీటు సంపాదించింది. ఈ యూనివర్సిటీలో సీటు సంపాదించిన తొలి అంధ విద్యార్థి అంచల్ కావటం ఒక విశేషం!




అదే ప్రారంభం...

లా కాలేజీలో సీటు సంపాదించటంతో అంచల్ ఆగిపోలేదు. ఆమె కథ అక్కడే మొదలయింది. లా చదువుతున్న సమయంలో తొలి ఏడాదే లాప్‌టాప్‌లో పరీక్షలు రాయటం ప్రారంభించింది. సాధారణంగా అంధ విద్యార్థులకు పరీక్షలు రాయటానికి ఒక అరగంట సమయం ఎక్కువగా ఇస్తారు. "కానీ నాకు ఎప్పుడూ ఆ అవసరం రాలేదు. మిగిలిన వారి కన్నా తక్కువ సమయంలోనే పరీక్షలు రాసేదాన్ని. లాప్‌టాప్‌ను సమర్థంగా వినియోగించుకోవటం వల్ల సమయం కలిసివచ్చేది" అంటారు అంచల్. చదువు పూర్తి కాగానే ఆమె ప్రస్తుత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ దగ్గర ఇంటర్న్ చేరింది. "నా ఇంటర్న్‌షిప్ పూర్తయిన వెంటనే చంద్రచూడ్ నాకో ఉత్తరం రాశారు. ఒక ఇంటర్న్‌గా నేను బ్రీఫ్‌లు రాయాల్సి ఉంటుంది. నేను తయారుచేసిన అలాంటి బ్రీఫ్‌లలో తనకు ఎటువంటి సమస్యలు రాలేదని ఆయన పేర్కొన్నారు.. నాకు అంత కన్నా పెద్ద ప్రశంస ఏముంటుంది" అంటారు అంచల్. ఇంటర్న్‌షిప్ తర్వాత అంచల్‌కు దేశంలోనే అత్యున్నత లా సంస్థలో ఉద్యోగమొచ్చింది. ఉద్యోగంలో చేరిన తర్వాత డిజిటల్ ప్రపంచంలో లభించే సమాచారం అంధులకు అందుబాటులో లేదనే విషయం అర్థమయింది. "ప్రతి రోజు కోర్టుకు అనేక పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. వీటి కోసం చాలా పరిశోధన చేయాల్సి ఉంటుంది. ఆ సమాచారమంతా డిజిటల్ ప్రపంచంలో ఉంటుంది. దానిని సేకరించాలంటే మొదట్లో చాలా కష్టంగా ఉండేది. ఎందుకంటే- చాలా వెబ్‌సైట్లు అంధులకు సహకరించే విధంగా ఉండవు..అందువల్ల మొదట్లో నేను ఇతరుల సాయం తీసుకొనేదాన్ని. ఆ తర్వాత నాకు ఆ అవసరం లేకుండా అయిపోయింది" అంటారు అంచల్. దీని కోసం తాను పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆమె గుర్తించింది. దీని కోసం ఆమె తన ప్రయత్నాలు ప్రారంభించింది. అంచల్ కథ- జీవితంలో ఎదురయ్యే కఠిన పరిస్థితులను తట్టుకొని కూడా ఎలా నిలబడవచ్చనటానికి ఒక పెద్ద ఉదాహరణ. మన చుట్టూ ఉన్న సమాజంలో కూడా అనేక మంది అంచల్‌లు ఉన్నారు. వారికి కొద్ది ఊతం ఇస్తే చాలు. తిరుగులేని శక్తిగా ఎదుగుతారు.



వ్యాధి నిరోధక శక్తినిచ్చే...



- విటమిన్స్, మినరల్స్ సపోటాలో పుష్కలం. ఓ రెండు సపోటాలు తింటే జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. దీనివల్ల పొట్ట సమస్యలు దరిచేరవు.
- ఈ పండులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు పొటాషియం ఉండటం వల్ల రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. గుండె సంబంధిత ఇబ్బందులు రాకుండా కాపాడుతుంది.
- ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ సౌందర్యానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా ఎ-విటమిన్ వల్ల చర్మం మీద మృతకణాలు తొలగిపోయిన వెంటనే కొత్త కణాలు వస్తాయి.
- వంద గ్రాముల సపోటాలను తింటే అందులో 83 కేలరీలు అందుతాయి. ఇందువల్ల కడుపు నిండినట్లు ఉంటుంది. అనారోగ్యానికి గురిచేసే ఇతర ఆహారాన్ని తినాలనుకోరు. అందుకే బరువు తగ్గాలనుకునేవాళ్లకు సపోటా సపోర్టుగా పని చేస్తుంది. వారి మెనూలో సపోటాను చేర్చుకోవాల్సిందే.
- కాల్షియం, ఫాస్పరస్ వల్ల ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అంతేనా జుట్టు ఆరోగ్యానికి మంచిది.
- ఇందులో చక్కెరశాతం ఉండటం వల్ల త్వరగా శక్తి వస్తుంది. ఈ చక్కెర శరీరానికి ఎలాంటి హాని చేయదు. ఇకపోతే ఎ, సి విటమిన్స్ వల్ల తెల్లరక్తకణాల వృద్ధికి దోహదపడతాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.
- సపోటాలు తినటం వల్ల నిద్ర పడుతుంది. మెదడు మీద ప్రభావం చూపడటం వల్లనే నిద్రవస్తుంది. దీనివల్ల ఒత్తిడి తగ్గిపోతుంది.
- డయాబెటిక్ బారిన పడినవాళ్లు ఈ సపోటాను ఎంచక్కా తినొచ్చు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., *Printed and Published* at "Aamoda Press" at 91, Wood Complex, Vedayapalem, Nellore, A.P., Tel. No.0861-2312299, Editor: **K.Srinivas**, RNI No. APTEL/2004/11742, **Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.



చికెన్ వ్యర్థాల రవాణా ఆపండి

కొడవలూరు, జూన్ 11 : తమ గ్రామం నుంచి చికెన్ వ్యర్థాల రవాణాను నిలిపివేయాలని మండలంలో రామన్నపాలెం గ్రామస్థులు టీడీపీ సీనియర్ నాయకుడు డేగ దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డేగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామం మీదుగా రొయ్యలు, చేపల గుంతల్లో వేసే ఆహారం కోసం చికెన్ వ్యర్థాలను భారీ వాహనాలతో తరలిస్తున్నారన్నారు. దీంతో ఆ వాహనాల నుంచి వెలువడే దుర్వాసన భరించలేక ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యర్థాల రవాణా కొంతమంది నాయకుల అండదండలతో గత ఐదేళ్లుగా విచ్చలవిడిగా జరుగుతుందన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. తమ గ్రామం గుండా రవాణా సాగిస్తే సహించేది లేదని, ప్రజల ఆరోగ్యమే తమకు ముఖ్యమన్నారు. అలాగే ఈ విషయంపై శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ దురవాసన భరించలేని కొన్ని కుటుంబాలు ఇతర గ్రామాలకు వలసలు వెళ్లారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. దీనిపై అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇంకపై తమ గ్రామం గుండా రవాణా సాగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నారయణ, రవి కుమార్, వంశీ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న రామన్నపాళెం గ్రామస్థులు

చంద్రబాబు ప్రమాణ స్వీకారం
వీక్షణకు ఏర్పాట్లు

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమాన్ని కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణులు, అభిమానులు వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. బుచ్చి రెడ్డిపాళెం, వెంకటాచలం మండలాల్లో ప్రత్యేక స్క్రీన్లు సిద్ధం చేశారు.


బుచ్చిలోని ఎంఎం ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్

వెంకటాచలం, జూన్ 11 : మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న శ్రీడ్స్ కల్యాణ మండపంలో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి ప్రమాణస్వీకార కార్యక్రమం ప్రారంభమవుతుందని, సర్వేపల్లి ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సోమిరెడ్డి కార్యాలయ వర్గాలు కోరాయి. కాగా, నారా చంద్రబాబు నాయుడును ఉండవల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేయబోతున్నందుకు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. సర్వేపల్లి నుంచి సోమిరెడ్డి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో చంద్రబాబు అభినందించారు.

200 మందికి పాసులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 11: చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారానికి కోవూరు నియోజకవర్గం నుంచి 200 మందికి పాస్‌లు ఇచ్చినట్లు బుచ్చి ఎంపీడీవో రాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. ప్రమాణస్వీకారానికి తరలివెళ్లే వారి కోసం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో మండలానికి ఒక బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవాడకు వెళ్లలేని వారికోసం బుచ్చిలోని ఎంఎం ఫంక్షన్ హాల్లో సుమారు వెయ్యి మంది ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ ఏర్పాట్లను తహసీల్దారు, ఎంపీడీవో, నగర పంచాయతీ కమిషనర్ పర్యవేక్షించారు. ఎమ్పీడీవో, నగర పంచాయతీ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.


రాపూరు : విజయవాడకు బయలుదేరుతున్న టీడీపీ శ్రేణులు

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ కాంతులు

మనుబోలు, జూన్ 11: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మంగళవారం విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అవుతున్న సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలన్నీ వెలుగులు జిమ్మేలా ఏర్పాటు చేశారు. మనుబోలులోని మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయం, పంచాయతీ, సచివాలయం-1 విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి. బుధవారం ప్రభుత్వ ఉద్యోగులందరూ కార్యాలయాల్లోనే ఉండి ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు కూడా ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రవికుమార్‌రెడ్డి తెలిపారు.

● రాపూరు(డక్కిలి) : విజయవాడలో బుధవారం జరగనున్న సీఎం చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాపూరు మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఆర్టీసీ బస్సులో బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు బస్సు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం రాత్రి అదే బస్సులో రాపూరుకు చేరుకుంటారని తెలిపారు.

మాతాశిశు మరణాలు నివారించాలి

● డీఎంహెచ్‌వో పెంచలయ్య

ఇందుకూరుపేట, జూన్ 11 : మాతాశిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య వైద్యాధికారులను ఆదేశించారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఈ నెలలో కాన్పు జరగాల్సిన గర్భిణులకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఆశా డే సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశా వలంటీర్లతో సీజనల్ వ్యాధులు, అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంపై చర్చించారు. జాతీయ కార్యక్రమాల్లో ఉత్తమ సేవలందిస్తున్న ఆశా వలంటీర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, సీసీలు రామకృష్ణారెడ్డి, సందీప్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలం వాయిదా

తోటపల్లిగూడూరు, జూన్ 11 : మండలంలోని చింతోపు పంచాయతీలో గల ఆంజనేయపురంలో ఉన్న సీతా రామాంజనేయ స్వామి దేవస్థానానికి సంబంధించిన 7 ఎకరాల 99 సెంట్ల మాగాణి భూములకు సంబంధించిన బహిరంగ వేలంపాటను మంగళవారం దేవదాయ శాఖ అధికారులు నిర్వహించారు. అయితే వేలం పాట నిర్వహణపై పాటదారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వేలంపాటను మరో తేదీకి వాయిదా వేయాలని కోరడంతో అధికారులు ఈ నెల 24కు వాయిదా వేశారు. ఈ విషయమై దేవదాయ కార్యనిర్వహణ అధికారి కవితను వివరణ కోరగా పాటదారులు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. వేలం పాటపై అభ్యంతరం వ్యక్తం చేసిన వారిలో కైలాసం ఆదిశేషారెడ్డి, మాగుంట రమణారెడ్డి, పైనం రామలింగయ్య, పైనం కోటేశ్వరరావు, తంబిరెడ్డి వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి గంగపట్నం చాముండేశ్వరి బ్రహ్మోత్సవాలు

● గోడపత్రిక ఆవిష్కరించిన వేమిరెడ్డి దంపతులు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వేమిరెడ్డి దంపతులు

ఇందుకూరుపేట, జూన్ 11 : మండలంలోని గంగపట్నంలో వెలసి ఉన్న చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి 24వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం టీడీపీ యువనేత దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు గోడపత్రిక, కరపత్రాలను ఆవిష్కరించారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ చాముండేశ్వరి దేవి ఆశీస్సులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీద చల్లగా ఉండి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి బండి శాంతయ్య, కోడూరు కమలాకర్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, పొన్నబోయిన చెంచుకిశోర్‌యాదవ్, మాచవోలు రామకృష్ణస్వామి, వెంకటరమణారెడ్డి, కృష్ణారెడ్డి, మారబోయిన జనార్దన్‌గౌడ్, చేవూరు కళ్యాణ్‌రెడ్డి, అమ్మ హ్యాచరీస్ చైర్మన్ దుర్గా శంకర్‌రెడ్డి, గంగపట్నం గ్రామస్థులు పాల్గొన్నారు.

15 నుంచి వరిగొండ జ్వాలాముఖి వార్షికోత్సవాలు

తోటపల్లిగూడూరు, జూన్ 11 : మండలంలోని వరిగొండ గ్రామంలో వెలసిన జ్వాలముఖి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వెల్లడించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో ఉభయకర్తలు దొడ్ల రామలింగారెడ్డి, గూడూరు విష్ణుమోహన్ రెడ్డి, జానా శ్రీనివాసులు, వల్లూరు శ్రీహరి, సోమన శ్రీనివాసులురెడ్డి, సుచిత్ర దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతాయని తెలిపారు. నిత్యం విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, పూలంగి సేవ, పల్లకీసేవ, లక్ష కుంకుమార్చన, అన్నదానం గ్రామోత్సవం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్నట్లు తెలిపారు. శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు తరలిరావాలని దేవస్థానం ఈవోతోపాటు అర్చకులు బొడ్డుపల్లి శ్రీనివాసశర్మ, మోహన్, కృష్ణ శర్మ కోరారు.

సోమిరెడ్డి గెలుపుతో విజయోత్సవ వేడుకలు


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న తెలుగు మహిళలు

పొదలకూరు, జూన్ 11 : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం విజయోత్సవం నిర్వహించారు. మండల మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి మహిళా నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సుగుణమ్మ మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలవడంతో ఈ వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం తెలుగు మహిళా కార్యదర్శి వెంపులూరు అరుణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, రైతు సంఘం నాయకులు కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొంగి మస్తానమ్మ, పద్మమ్మ మద్దిరెల్ల సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌లో 'నారాయణ'కు ఉత్తమ ర్యాంకులు

నెల్లూరు (విద్య), జూన్ 11 : ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వీ విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని నారాయణ కళాశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్ విభాగంలో తమ అకాడమీకి చెందిన షేక్ సూరజ్ 15వ ర్యాంకు, ఏ శ్రీనికేష్ 253, టీ భువనేశ్వరి 358, బీ శ్రీశాంత్ 460, పూర్ణసాయి నితీష్ 499, వీ సంతోష్‌రెడ్డి 778, ఓ చక్రేష్ 947వ ర్యాంకు సాధించారన్నారు. వెయ్యిలోపు ర్యాంకులను ఏడుగురు, 2వేలలోపు 19 మంది, 3వేలలోపు 34 మంది, 5వేలలోపు 62 మంది, పదివేలలోపు 150 మంది, 20వేలలోపు 361 మంది, 30వేలలోపు 576 మంది, 50వేలలోపు 1017 మంది ర్యాంకులు సాధించారన్నారు. అలాగే అగ్రికల్చర్ విభాగంలో నారాయణ మెడికల్ అకాడమీకి చెందిన కే వెంకట సాత్విక్ 17వ ర్యాంకు, కే సౌరభ్‌రెడ్డి 22, బీ ఫణిశ్రీ శశాంక్ 70, ఏ చెంచు ఈశ్వరప్రసాద్ 77వ ర్యాంకు సాధించారన్నారు. 500లోపు ర్యాంకులను 17 మంది, వెయ్యిలోపు 22 మంది, 5వేలలోపు 52 మంది, పదివేలలోపు 80 మంది, 20వేలలోపు ర్యాంకులను 118 మంది సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కోర్ డీన్లు, డీన్లు, డీజీఎంలు, ఏజీఎంలు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్ గృహ కల్ప
సమస్యల సహవాసం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూన్ 11 : నగరంలోని ఇరగాళమ్మకూడలి సమీపంలో ఉన్న రాజీవ్‌గృహకల్ప వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ..ఇన్నీ కావు. ఈ ఇళ్ల సముదాయంలో అందరూ పేద ప్రజలే నివసిస్తున్నారు. ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఉంటున్నా కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ఇళ్ల చుట్టూ వ్యర్థాలు, మురుగునీరు నిలువ ఉండటంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దోమల బెడద తీవ్రంగా ఉంది. ఇళ్ల పరిసరాల్లో పిచ్చి పొదలు పెరిగిపోవడంతో విషకీటకాలు సంచరిస్తున్నాయి. వీధిదీపాలు సక్రమంగా వెలగక పోవడంతో రాత్రుళ్ల ఈ ప్రాంత ప్రజలు బయటకు రావాలంటే భయాందోళన చెందుతున్నారు. కొళాయిల్లో నీరు సక్రమంగా సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు సైతం కిందనే వేలాడుతూ ప్రమాద హెచ్చరికలు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రాజీవ్ గృహకల్పలో వసతులు, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.


రాజీవ్ గృహకల్ప నివాస సముదాయాల వద్ద భారీగా పేరుకున్న వ్యర్థాలు


వ్యర్థాలతో పూడిపోయిన సైడు కాలువ

చెత్త తొలగించడం లేదు : సుధా



మా ప్రాంతంలో నివాసాల చుట్టూ వ్యర్థాలు పేరుకుంటున్నాయి. రోడ్ల పైన, కాలువల్లో ఎక్కడ చెత్త అక్కడే నిలిచిపోతోంది. దీంతో రాత్రి,పగలు అన్న తేడా లేకుండా దోమలు కుట్టిపెడుతున్నాయి. దుర్వాసన భరించలేకున్నాం. అధికారులు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి.

కాలువల్లో పూడిక తీయడం లేదు. : మహాలక్ష్మి



ఇక్కడ కాలువలన్నీ మురుగు, చెత్తతో నిండిపోయాయి. కనీసం వారానికి ఒక్కసారి కూడా కాలువల్లో పూడిక తీయడం లేదు. దీంతో మురుకి నీరు నివాసాల్లోకి, రోడ్లపైకి పారుతోంది. దోమలతో చిన్నపిల్లలు ఇబ్బందిపడుతున్నారు. తరచూ జ్వరాలు వస్తున్నాయి. అధికారులు మా ప్రాంతాన్ని బాగుచేయాలి.

కనకమ్మ, దువ్వూరి రుణం తీర్చుకోలేనిది


కనకమ్మ, రామిరెడ్డి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 11: స్వాతంత్ర సమర యోధురాలిగా, బాలికా విద్య ను ప్రోత్సహించిన ప్రథమ మహిళగా పొనకా కనకమ్మ, అద్భుతమైన కవితలు, రచనలు అందించిన కోకిల దువ్వూరి రామిరెడ్డి సేవలు, రుణం నెల్లూరు జిల్లా ఏనాటికీ తీర్చుకోలేని దని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో పురమందిరంలో వారిద్దరి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బీ సరేంద్రనాథరెడ్డి, మెట్టు రామచంద్ర ప్రసాద్, డాక్టరు చంద్రలత ఉపన్యసించారు. రామిరెడ్డి, కనకమ్మ గొప్పతనాన్ని వివరించారు. ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయప్రద, డీ పార్థసారథి సీతాసారంగ పాణి, ఎన్ బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఫోర్జరీ' స్కాం పై విచారణ కమిటీ

● సచివాలయ ఉద్యోగులకు షోకాజు నోటీసులు

నెల్లూరు(సిటీ), జూన్ 11 : నెల్లూరు నగర పాలక సంస్థలో ఫోర్జరీ సంతకాల స్కాంలో క్రమేణా ఉచ్చు బిగుసుకుంటోంది. లోతైన దర్యాప్తు జరిపి దోషులను గుర్తించేందుకు కమిషనర్ వికాస్ మర్మత్ విచారణ కమిటీ వేయాలని నిర్ణయించుకున్నారు. ఆ దిశగా పత్రం సిద్ధం చేసిన ఆయన సెలవుల్లో ఉన్న ఏడీసీ, డీసీలు రాగానే కమిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. నెల్లూరులోని వివిధ ప్రాంతాలలో భవన నిర్మాణాల రుణాల కోసం దరఖాస్తులు లీగల్ అభిప్రాయాలకు వెళ్లగా ఓసీ లేదని, మార్టిగేజ్ సంతకాల్లో తేడాలను గుర్తించి న్యాయవాది కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. మేయర్ భర్తతోపాటు నెల్లూరురూరల్‌కు చెందిన జిల్లా సహకార సంస్థ చైర్మన్ పేర్లు వినబడుతున్నాయి. వైసీపీకి చెందిన ఓ నేత మౌఖిక ఆదేశాలతోనే పత్రం కదిలినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కాగా, స్కాంలో సంబంధం ఉన్న 12, 24 డివిజన్లలోని సచివాలయాల్లో ప్లానింగ్ సెక్రటరీలుగా పని చేస్తున్న ఇద్దరికి కమిషనర్ నోటీసులు జారీ చేశారు. అయితే, 12వ డివిజన్ సెక్రటరీ మాత్రం నోటీసులు తీసుకోలేదని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు.

దత్తాత్రేయ జన్మదిన వేడుకలు


చీరలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 11: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ 72వ జన్మది న వేడుకలను ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సమాది శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. బీజేపీ నాయకుడు మిడతల రమేష్ పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బీసీ సమాజానికి దత్తాత్రేయ ఎనలేని సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీళ్ల మల్లికార్జున యాదవ్, అవుల శివరామకృష్ణ, కందల రవికుమార్ యాదవ్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడిగా శ్రీరామచంద్రుడు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 11 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమే శ్వరి ఆలయంలో జరుగుతున్న గజేంద్రమోక్షం ఉత్సవాల్లో మంగళవారం రాత్రి శ్రీరామచంద్రుడు కోదండరాముడిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం విశేష పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్తలు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

గిరిజన విద్యార్థులకు బ్యాగుల వితరణ


విద్యార్థినికి బ్యాగు బహూకరిస్తున్న మందా రాణి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 11 : జిల్లాలో పదో తరగతిలో 500లకు పైబడి మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ పీవో డాక్టర్ మందా రాణి బ్యాగులను బహూకరించారు. ఐటీడీఏ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. రాబోవు విద్యాసంవత్సరంలోనూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని పీవో ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల డీటీడబ్ల్యూవోలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో విద్యారంగం నిర్వీర్యం

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

నెల్లూరు (విద్య), జూన్ 11 : వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో విద్యారంగం నిర్వీర్యమైపోయిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల విమర్శించారు. నెల్లూరులోని టౌన్‌హాలులో మంగళవారం ఆ సంఘం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులను వేధించడమే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం పనిచేసిందన్నారు. ప్రధానంగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉపాధ్యాయులను స్వేచ్ఛగా చదువు చెప్పనీయకుండా భయభ్రాంతులకు గురిచేశార న్నారు. చేయని తప్పులకు ఎంతోమందిని సస్పెండ్ చేయడమేకాక హక్కుల కోసం పోరాటం చేసిన వారిపై కేసులు పెట్టారన్నారు. ఆ కేసులను నూతన ప్రభుత్వం ఎత్తివేయాలని కోరారు. ఉపాధ్యాయులంతా కూడా ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణకు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీటీఎఫ్-1938కు చెందిన నేతలు, సభ్యులంతా కూడా నూతనంగా సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్, తిరుపతి జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు మురళి, బాలసుబ్రహ్మణ్యం, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు దశరథరామయ్య, ప్రధాన కార్యదర్శి హజరత్, నాయకులు పాల్గొన్నారు.

గుండెకు కాలు నుంచి కవాటం అమరిక

● అపోలో ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు(వైద్యం) జూన్ 11 : నెల్లూరు అపోలో ఆసుపత్రిలో అరుదైన గుండె శస్త్రచికిత్స జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ అఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ భక్తవత్సల రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన నాగేశ్వరరావు(70) ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఫేస్‌మేకర్ ద్వారా గుండెను నాలుగు సెకండ్ల దాకా ఆపి ఆధునికరీతిలో కాలు ద్వారా కవాటం అమర్చి శస్త్రచికిత్సను నిర్వహించామని వివరించారు.

శివరాజ్ చౌహాన్‌కు శుభాకాంక్షలు



నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట) : కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీక రించనున్న బీజేపీ అగ్రనేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయనను ఢిల్లీలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఊటుకూరులో రెండు పూరిళ్లు దగ్ధం

విడవలూరు, జూన్ 11 : మండల పరిధిలోని ఊటుకూరు పంచా యతీ బడంకాయగుంట ఎస్టీ కాలనీలో మంగళవారం ప్రమాదవశాత్తు రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం మేరకు.. కాలనీకి చెందిన ఎందోటి వెంకమ్మ వంట చేస్తుండగా ఈదురు గాలులకు నిప్పు రవ్వలు పూరింటిపై పడి మంగలు చెలరేగాయి. దీంతో ఇల్లు పూర్తిగా దగ్ధమై ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం దగ్ధమయ్యాయి. పక్కనే ఉన్న రాపూరు ప్రసాద్ ఇంటికి సైతం నిప్పు రవ్వలు అంటుకుని అది కూడా 60 శాతం మేరకు దగ్ధమైయింది. ఈ సంఘటనలో ఎంబేటి వెంకమ్మ కు రూ.1.50 లక్షలు, రాపూరు ప్రసాద్‌కు రూ.50వేలు నష్ట వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు అధికా రులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారించారు. స్థానికులు చొరవ తీసుకుని మంటలు వ్యాప్తించకుండా నీరు చల్లి ఆర్పివేశారు.


అగ్నిప్రమాదంతో దగ్ధమైన పూరిల్లు

అడ్డదిడ్డంగా పార్కింగ్


నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 3 : నగరంలోని నిప్పో సెంటర్ నుంచి వేదాయపాళెం వరకు సాయంత్రం వేళ రోడ్డు పక్కన వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతుండటంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు అసౌకర్యం కలుగుతోంది. ప్రధాన రహదారికి తూర్పు వైపున ఉన్న వ్యాపార సంస్థలు, హోటళ్లు, దుకాణాలకు వచ్చే వారు రోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. ఈ విధమైన పార్కింగ్ వెనుకవచ్చే వాహనాలకు ఇబ్బందిగా, ప్రమాదకరంగా మారుతోంది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం 12-6-2024
Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
తిరుపతి

ఘనంగా బాబు ప్రమాణస్వీకార ఏర్పాట్లు




శ్రీకాళహస్తిలో చేస్తున్న ఏర్పాట్లు
- తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో ఏర్పాట్లు



మళ్లీ చిగురిస్తున్న ఆశలు

నేడు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

అభివృద్ధిలో పరుగులు పెట్టనున్న సొంత జిల్లా

తిరుపతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు అక్షరాలా మళ్లీ మహర్దశ మొదలు కాబోతోంది. అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెట్టబోతోంది. రాష్ట్రంలోనే కాకుండా జాతీయస్థాయిలో తిరిగి గుర్తింపునకు నోచుకునే సుముహూర్తం ప్రారంభమవుతోంది. నేడు చంద్రబాబు నాలుగోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.సొంత జిల్లాలో అభివృద్ధిపై, శాంతి భద్రతల పరిరక్షణపై, క్రమశిక్షణతో కూడిన పాలనపై చంద్రబాబు పట్ల ప్రజల్లో ఆశలు, ఆకాంక్షలు తిరిగి మొలకెత్తుతున్నాయి.జిల్లాలో చంద్రబాబు అభివృద్ధికి పర్యాయపదంగా మారారంటే అతిశయోక్తి కాదు. ఆయన పేరు తలిస్తే చాలు తిరుపతి ఐఐటీ మదిలో మెదులుతుంది. ఐఐఎస్ఈఆర్ కళ్ళ ముందు కదలాడుతుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలినరీ, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు గుర్తుకొస్తాయి. అవే కాదు బెంగళూరు నుంచీ చిత్తూరు మీదుగా చెన్నై వెళ్ళే ఫోర్ లేన్ సిమెంట్ రోడ్డు, పూతలపట్టు నుంచీ నాయుడుపేట వరకూ ఆరు వరుసల జాతీయ రహదారి జిల్లా స్వరూపాన్ని మార్చిన తీరు కళ్ళ ముందు నిలుస్తుంది. స్మార్ట్ సిటీలో భాగంగా తిరుపతి నగరం నడిబొడ్డున గరుడ వారధి చటుక్కున జ్ఞాపకమొస్తుంది. రేణిగుంట, ఏర్పేడు మండలాల నడుమ జిల్లా ప్రతిష్ఠను ఉవ్వెత్తున పెంచిన శ్రీ వెంకటేశ్వర ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ యూనిట్లు, వాటిలో వెలసిన ప్రతిష్ఠాత్మక పరిశ్రమలు స్ఫురిస్తాయి. ఇంకాస్త వెనక్కు వెళితే ప్రతి రెవిన్యూ డివిజన్‌లో ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసిన సీఎంగా చంద్రబాబు పాలన తొలిరోజులు గుర్తుకొస్తాయి. కుప్పంలో ఇజ్రాయెల్ టెక్నాలజీతో వ్యవసాయాన్ని ఆధునికత వైపు పరుగులు పెట్టించడం, అక్కడే ద్రవిడ విశ్వవిద్యాలయం, పీఈఎస్ మెడికల్ కళాశాల ఏర్పాటు వంటివి ఆయన చొరవకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన వైనం జ్ఞప్తికొస్తుంది. హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టుల పనులను పరుగులెత్తించి కాలువ గట్లపై నిద్రించిన ఆయన పట్టుదల జిల్లా ప్రజలు మరచిపోవడం సాధ్యమేనా? ముఖ్యమంత్రిగా చంద్రబాబు వ్యవహరించిన 14 ఏళ్ళలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సంభ్రమాశ్చర్యపరిచే విధంగా అభివృద్ధికి నోచుకున్న సంగతి తెలియంది కాదు. తాజాగా మరో ఐదేళ్ళ కాలానికి ఆయన ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేపడుతున్న తరుణంలో జిల్లా ప్రజలు మరోమారు జిల్లా అభివృద్ధిపై ఆశలు పెంచుకుంటున్నారు. గడిచిన ఐదేళ్ళలో స్తంభించిన అభివృద్ధి పనుల్లో తిరిగి కదలిక వస్తుందని, పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తయి వ్యవసాయం జోరందుకుంటుందని ఆశిస్తున్నారు. చంద్రబాబు దార్శనికత, చొరవ, సొంత ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ... వెరసి జిల్లా భవిష్యత్తును ఉన్నతంగా నిర్దేశిస్తుందని కలలు కంటున్నారు. వారి ఆశలు నెరవేరాలని ఆశిస్తూ... ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న జిల్లా ప్రజల తరపున చంద్రబాబుకు శుభాకాంక్షలు!

మునిరాజమ్మకు ప్రత్యేక ఆహ్వానం

శ్రీకాళహస్తి, జూన్ 11: వైసీపీ అరాచకాలను ప్రతిఘటించి పోరాడిన రజక మహిళ మునిరాజమ్మ చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక ఆహ్వానం అందుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణం శివారు రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మునిరాజమ్మకు అక్కడే ఇంటి స్థలం ఉంది. సమీపంలో చిన్నపాటి టిఫిన్ సెంటర్ నిర్వహించేది. అక్కడ ఆమె స్థలంలో ఇల్లు నిర్మించుకునే సమయంలో కొందరు వైసీపీ నేతలు ఇబ్బంది పెట్టారు. విద్యుత్ కనెక్షన్ కోసం నెలల తరబడి ప్రాధేయపడగా రూ.20వేలు ఇస్తే కనెక్షన్ ఇస్తామంటూ అధికారులు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో టీడీపీ యువనేత నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా గత యేడాది ఫిబ్రవరి 17వ తేదీన శ్రీకాళహస్తి మీదుగా సాగారు. రాజీవ్ నగర్ కాలనీ వద్ద మునిరాజమ్మ నారా లోకేష్‌ను కలిసి తన సమస్యను విన్నవించారు. దీంతో మూడు రోజుల తరువాత కొందరు వైసీపీకి సంబంధించిన వ్యక్తులు మునిరాజమ్మ టిఫిన్ సెంటర్ వద్దకు చేరుకుని చిల్లర పేరుతో గొడవ చేశారు. టిఫిన్ దుకాణంలో పాత్రలను విసిరి కొట్టి భయాందోళనకు గురి చేశారు. అంతటితో ఆగకుండా రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు చేశారు.టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు మునిరాజమ్మకు అండగా నిలిచారు. ఆ తరువాత చంద్రగిరిలో నారా లోకేష్ నేతృత్వంలో జరిగిన రజక సమావేశంలో మునిరాజమ్మ పాల్గొని లోకేష్‌ను కలిసినందుకు తనను వైసీపీ నేతలు ఎంతగా ఇబ్బందులకు గురిచేశారో వివరించారు. టీడీపీ అండగా ఉండడంతో పాటు అధికారంలోకి వచ్చిన వెంటనే మంచి ఉపాధి కల్పిస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. ఆ తరువాత ఆమెను ఫోన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు దుర్భాషలాడటం జరిగింది. మళ్లీ ఆమె స్థానిక టీడీపీ నేతల సాయంతో విజయవాడలో చంద్రబాబును కలిసి వైసీపీ అరాచకాలను వివరించారు. వెంటనే ఆయన రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని మునిరాజమ్మకు అందజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఖచ్చితంగా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇటీవల ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన చంద్రబాబు బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న విషయం విదితమే. మునిరాజమ్మకు టీడీపీ నుంచి ప్రత్యేక ఆహ్వానం పంపారు.



అదృష్టంగా భావిస్తున్నా

చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవానికి ప్రత్యేక ఆహ్వానం అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. ఎన్ని జన్మలెత్తినా చంద్రబాబు,లోకేష్, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆయన తల్లి బృందమ్మ రుణం తీర్చుకోలేను. రాష్ట్రానికి వైసీపీ నుంచి విముక్తి కలగాలని గంగమ్మ తల్లికి మొక్కాను.ఎట్టకేలకు ప్రజలు గొప్ప తీర్పు ఇచ్చారు. రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయి. ప్రజలందరూ సంతోషంగా జీవిస్తారు.

- మునిరాజమ్మ

ప్రత్యక్ష వీక్షణకు పలుప్రాంతాల్లో ఏర్పాట్లు

జిల్లానుంచి విజయవాడకు పెద్దఎత్తున బయల్దేరిన టీడీపీ నేతలు, ప్రజలు



విజయవాడలో మంగళవారం జరిగిన టీడీఎల్పీ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్యేలతో లోకేష్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 11: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి జిల్లాలో గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ ప్రధాన కేంద్రం వరకు 138 ప్రదేశాల్లో ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. విజయవాడలో ప్రమాణ స్వీకారాన్ని వీక్షించడానికి ఒక్కో నియోజకవర్గం నుంచి నాలుగు బస్సుల ద్వారా జనం తరలివెళ్లినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో, తిరుపతి నియోజకవర్గ కార్యక్రమం తిరునగరిలోని కచ్చపి ఆడిటోరియంలో ఉంటుందన్నారు. నియోజకవర్గాల వారీగా.. సత్యవేడుకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరం, గూడూరుకు సీఆర్‌రెడ్డి కల్యాణ మండపం, సూళ్లూరుపేటకు ఆర్యవైశ్య కల్యాణమండపం, వెంకటగిరికి ఎంసీ మీటింగ్ హాల్, శ్రీకాళహస్తికి ఎన్టీఆర్ పార్కు మండల కార్యాలయం పక్కన, చంద్రగిరికి నారావారిపల్లెలో సీహెచ్‌సీ సమావేశమందిరం, ఇవే కాకుండా ప్రతి ఒక్కరూ వీక్షించేలా ప్రతి మండల కార్యస్థానంలో ఎంపీడీవో సమావేశ మందిరాలు, కమ్యూనిటీ హాల్, పలు గ్రామ పంచాయతీల పరిధిలోని అంగన్‌వాడీలు, పాఠశాల భవన ఆవరణంలో, కమ్యూనిటీ కేంద్రాల్లో మొత్తం 138 ప్రదేశాల్లో ఎల్ఈడీ స్క్రీన్, టీవీ, ఇంటర్నెట్, డిష్ సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.



చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవానికి తిరుపతి నుంచి బస్సుల్లో బయల్దేరిన టీడీపీ నాయకులు

ఈఏపీసెట్‌లో విరిసిన ప్రతిభ

తిరుపతి(విద్య), జూన్ 11: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ ఫలితాలను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.



ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేయడమే లక్ష్యం

మాది బాలాయపల్లి మండలం వెంగమాంబపురం. న్యాయవాది వడ్లమూడి మురళి నాయుడు, సరళ మా తల్లిదండ్రులు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాను. ఇదే ఏడాది విడుదల నీట్ ఫలితాల్లో 720 మార్కులకుగాను 720 సాధించి ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించాను. తెలంగాణ ఈఏపీ సెట్‌లోనూ ఏడో ర్యాంకు వచ్చింది. ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదవడమే నా లక్ష్యం.

- వడ్లమూరి ముఖేష్ చౌదరి, మూడో ర్యాంకు (అగ్రికల్చర్)



ఐఐటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చదవడమే ధ్యేయం

మా తల్లిదండ్రులు నాగేశ్వర్‌నాయుడు (నూతుగుంటపల్లి అప్పర్‌ప్రైమరీ స్కూల్ టీచర్, రామచంద్రాపురం మండలం), అభినందన (దామినీడు పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్). తిరుపతి నారాయణ కళాశాలలో చదివాను. తెలంగాణ ఈఏపీ సెట్‌లో 100 ర్యాంకు సాధించారు. జేఈఈ మెయిన్స్‌లో 225 ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో 886 ర్యాంకు వచ్చింది. ఐఐటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చదవడమే నా ధ్యేయం.

- రాయపాటి పుష్కర్, 17వ ర్యాంకు (ఇంజనీరింగ్)




ముని కార్తీక్ - రాహుల్ వర్మ




మెహర్‌బాబా రోహిత - నరేంద్ర ఠాగూర్

అగ్రికల్చర్ విభాగంలో అగ్రగణ్యులు

అగ్రికల్చర్ విభాగంలో బాలాయపల్లి మండలం వెంగమాంబపురానికి చెందిన వడ్లపూడి ముఖేష్ చౌదరి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించి సత్తా చాటారు. తిరుపతి రూరల్ చెర్లోపల్లెకి చెందిన తుంగా మునికార్తీక్ 35వ ర్యాంకు సాధించారు. సత్యవేడు మదనంబేడు వీఆర్ కండ్రిగకు చెందిన దాసరాజు రాహుల్ వర్మ 39వ ర్యాంకు పొందారు. తిరుపతి శాంతినగర్‌కు చెందిన పసుపులేటి మెహర్‌బాబా రోహిత 46వ ర్యాంకు సాధించారు. తిరుపతి రూరల్ అవిలాల ఉపాధ్యాయనగర్‌కు చెందిన పత్తిపాటి నరేంద్ర ఠాగూర్ 68 ర్యాంకు సాధించారు. తిరుపతికి చెందిన బోడిపాటి చరిష్మ 132వ ర్యాంకు, గొడుగుచింత రాజకీర్తన్ రెడ్డి 197వ ర్యాంకు పొందారు. యోగిమల్లవరానికి చెందిన జీఎస్ యోచిత్ 204వ ర్యాంకు సాధించారు. తిరుపతి నారాయణపురానికి చెందిన కూసూరు సాయి సమిత్‌రెడ్డి 303వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. తిరుపతి కొరమేనుగుంటకు చెందిన సింగనసాయి బ్రహ్మతేజ రాష్ట్ర స్థాయిలో 373వ ర్యాంకు సాధించి జిల్లా స్థాయిలో 10వ స్థానంలో నిలిచారు.





పీయూష్ ప్రణవ్ - శ్రీవివశ్వత్ - యశ్వంత్ కుమార్

ఇంజనీరింగ్ విభాగంలో తురుపు ముక్కలు



అభిరామ్‌రెడ్డి

తిరుపతి రామకృష్ణ స్ట్రీట్‌కు చెందిన రాయపాటి పుష్కర్ రాష్ట్ర స్థాయిలో 17వ ర్యాంకు సాధించి జిల్లాలో ప్రథముడిగా నిలిచారు. తిరుపతి బజారు వీధికి చెందిన గుణకల పీయూష్ ప్రణవ్ 38వ ర్యాంకు సాధించారు. తిరుపతి ఎంఆర్‌పల్లె ఉల్లిపట్టెడకు చెందిన జె.శ్రీ వివశ్వత్ 141వ ర్యాంకు పొందారు. శ్రీకాళహస్తికి చెందిన నాగోలు యశ్వంత్ కుమార్‌రెడ్డి 151వ ర్యాంకు సాధించారు. శ్రీకాళహస్తికి చెందిన సిద్ధగుంట అభిరామ్‌రెడ్డి 161వ ర్యాంకు సాధించారు. తిరుపతి న్యూ మారుతీనగర్‌కు చెందిన సిద్దార్థి వివేకానంద్ 172వ ర్యాంకు సాధించారు. తిరుపతి రూరల్ యోగిమల్లవరానికి చెందిన పి. ప్రకాష్ 212వ ర్యాంకు సాధించారు. తిరుపతి మంగళంకు చెందిన గుండా జోష్మిత 227వ ర్యాంకు సాధించారు. గూడూరు ఎస్‌జేఆర్ కాలనీకి చెందిన పేటేటి దివ్య పూర్ణచంద్ 233వ ర్యాంకు సాధించగా తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన శెట్టిపల్లి సాయి శ్వేత 354వ ర్యాంకు సాధించి జిల్లా స్థాయిలో 10వ స్థానంలో నిలిచారు.

టీడీపీ అధినేతతో ఏఎంసీ మాజీ చైర్మన్



బాలాయపల్లి, జూన్ 11: మండలంలోని వెంగమాంబ పురానికి చెందిన వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ సీసీ నాయుడు మంగళవారం ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



నార్సింగ్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని తెలంగాణ రాష్ట్రం రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో ఆయన చేసిన అభివృద్ధి కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నదన్న ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాల్గోసారి ప్రమాణస్వీకారం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయన శిష్యులమని చెప్పుకునేందుకు తాము గర్వంగా ఫీల్ అవుతున్నామన్నారు. ఐటీ రంగం ఇంతగా అభివృద్ధి చెందిందంటే అది చంద్రబాబు చలవేనన్నారు. పేదలకు సంక్షేమ పథకాలను అందించడంలో ఆయనది పెద్దన్న పాత్ర అని విద్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో ఆయన ఉపాధ్యాయుడిలాంటి వారని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం అందరికీ గర్వకారణమన్నారు. ప్రజలకు మేలు చేస్తాడు కాబట్టి ఆయనను విజయం వరించిందన్నారు. గత ఐదేళ్లు ఆయన పేదల పక్షాన పోరాడారు కాబట్టే అంత మెజార్టీతో గెలుపొందాడన్నారు. ఇక తిరుమలలో కూడా భక్తులకు ఇబ్బంది లేకుండా ఆయన చూసుకుంటాడనే నమ్మకం తనకుందన్నారు.

నీట్ అవకతవకలపై

సీబీఐ విచారణ జరపాలి: ఏబీవీపీ



నాయుడుపేట టౌన్, జూన్ 11: నీట్ అవకతవకలపై సీబీఐ విచారణ చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.చెందు డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీట్‌లో 67 మందికి ఆల్‌ఇండియా ఫస్ట్‌ర్యాంక్ రావడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేయించాలని ఆయన కోరారు. వైష్ణవి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చిన్నమాంబట్టు విద్యార్థికి యూటీఎఫ్ చేయూత

తడ, జూన్ 11: అనారోగ్యానికి గురైన 9వ తరగతి విద్యార్థికి యూటీఎఫ్ చేయూత అందించింది. ఎన్ఎంకండ్రిగకు చెందిన వై.చరణ్ చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్సలకు ఆర్థిక సమస్య తలెత్తడంతో విషయం తెలుసుకున్న యూటీఎఫ్ సంఘ నాయకులు ఆ విద్యార్థికి రూ.25 వేలను అందించారు.. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు బాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూముల్లో డంపింగ్‌యార్డ్?

24 గంటలైనా ఆరని మంటలు ● పరిశ్రమ వ్యర్థాల నిల్వ ● అగ్నిప్రమాదంతో గుట్టురట్టు ● రీసైక్లింగ్ కోసం భూములను కేటాయించాం: ఏపీఐఐసీ జీఎం

తడ, జూన్ 11: పరిశ్రమల కోసం కేటాయించిన భూములు పక్కదారి పట్టాయి. వైసీపీ నాయకులు చెప్పారంటూ అధికారులు అనర్హులకు ఆ భూములు కట్టబెట్టారు. ఇప్పుడు భారీ అగ్ని ప్రమాదం జరగడంతో సదరు అధికారులు తమ తప్పు తెలుసుకొని బెంబేలెత్తుతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో 2006వ సంవత్సరంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో అప్పటి రాష్ట్రప్రభుత్వం మాంబట్టు సెజ్‌ను ఏర్పాటు చేసింది. వందల ఎకరాల్లో పలు భారీ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. మిగులు భూములను చక్కబెట్టేందుకు గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు ప్రయత్నం చేశారు. అందుకు నెల్లూరుకు చెందిన కొందరు వైసీపీ పెద్దలు అండదండలు ఉండటంతో ఏడాది క్రితం సుమారు 10 ఎకరాలను ఓ వ్యక్తి పేరుపై ఏపీఐఐసీ అధికారులు కేటాయించారు. పరిశ్రమల నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలను అక్కడ రీసైక్లింగ్ చేసే పరిశ్రమ ఏర్పాటు కోసమంటూ ఆ భూములను పొందారు. అయితే రీసైక్లింగ్ చేయకపోగా వ్యర్థాలను డంపింగ్ చేసేలా యార్డ్‌లా మార్చేశారు. ఏడాదిగా డంపింగ్‌యార్డ్ పని చేస్తున్నా... ఏపీఐఐసీ అధికారులకు కనబడలేదు. వ్యర్థాలను ఇతర ప్రాంతాలకు తరలించి నిర్వీర్యం చేసే విధంగా సదరు స్థలం యజమాని ఆయా పరిశ్రమల నుంచి వాటిని సేకరిస్తారు. అయితే వాటిని తరలించకుండా గుట్టుచప్పుడు కాకుండా అదే స్థలంలో కాల్చి వేస్తుంటారు. అయితే సోమవారం ఇలాగే ఆ వ్యర్థాలను కాల్చివేస్తుండగా ఆ మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడి మిగిలిన వ్యర్థాలకు అంటుకున్నాయి. మంగళవారం సాయంత్రం వరకు ఆ మంటలు మండుతూనే ఉన్నాయి. సుమారు 5 ఫైర్ ఇంజన్లు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు శ్రమించినా పూర్తిస్థాయిలో మంటలు అదుపులోకి రాలేదు. ఇలా ప్రమాదం జరగడంతో అసలు గుట్టు రట్టు అయ్యింది. రీసైక్లింగ్ పరిశ్రమ పేరుతో ఒక వ్యక్తికి ఇలా భూములను ఎలా కేటాయించారో మిలియన్ డాలర్ల ప్రశ్న. భూములు కేటాయించడంపై ఏఎపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.విజయరత్నంను ఆంధ్రజ్యోతి ఫోన్‌లో వివరణ కోరగా... తాము భూములను కేటాయించింది రీ సైక్లింగ్ పరిశ్రమ కోసమని అందుకు సంబంధించి మిగతా వివరాల కోసం రికార్డులను పరిశీలించాల్సి ఉందని వివరణ ఇచ్చారు. డంపింగ్ యార్డ్ నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం లేదన్నారు.



డంపింగ్ యార్డు వద్ద కమ్ముకున్న దట్టమైన నల్లటి పొగ

సమస్యలు పరిష్కరించండి

సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

సూళ్లూరుపేట, జూన్ 11: ఇకనైనా వార్డుల్లో సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు కోరారు. మంగళవారం గాండ్ల వీధిలోని శ్రీ స్వశక్తి భవనంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ డి.శ్రీమంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముందుగా టీడీపీ కౌన్సిలర్ ఈ.చెంగమ్మ మాట్లాడుతూ... ఇకపై కౌన్సిలర్లకు మర్యాద ఇచ్చేలా అధికారులు నడుచుకోవాలన్నారు. అదే విధంగా పట్టణంలో ఎక్కడ చూసినా మురుగు పేరుకుపోయిందని, చెత్తాచెదారం తొలగించడం లేదని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ... ఎన్నికల విధుల్లో నెల రోజుల పైబడి ఉండడం వల్ల పట్టణంలో కొన్ని సమస్యలు పేరుకుపోయాయని, విడతల వారీగా వాటిని పరిష్కరిస్తామన్నారు. పట్టణంలో బఫర్ జోన్‌లో నిర్మాణాలు జరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కోఆప్షన్ సభ్యుడు కె.సునీల్ రెడ్డి చెప్పారు. మొత్తం 7 అంశాలను అజెండాలో పొందుపరిచి సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పైపు లైన్ గోతులు తక్షణం పూడ్చండి



సమావేశంలో ప్రసంగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక

నాయుడుపేట, జూన్ 11: మున్సిపల్ పరిధిలోని 25 వార్డుల్లో ఇష్టారాజ్యంగా గ్యాస్ పైపులైన్ తవ్వకాలు జరుగుతున్నాయని, వాటిని పూడ్చకుండా అలాగే వదిలేదుస్తున్నారి పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కె.దీపిక అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ... ఒక ప్రాంతంలో గ్యాస్ పైప లైన్ తవ్వకాలు పూర్తి చేసి గోతులు పూడ్చిన తరువాతే మరో ప్రాంతంలో చేపట్టాలన్నారు. పలుప్రాంతాల్లో తాగునీటి పైపులు ధ్వంసమయ్యాయని నీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. పన్ను బకాయిలను సకాలంలో వసూలు చేస్తే వార్డుల్లో అభివృద్ధి పనులకు చేపట్టగలుగుతామన్నారు. కమిషనర్ జనార్దన రెడ్డి మాట్లాడుతూ... గ్యాస్ పైపు లైన్ నిర్వాహకుల నుంచి బ్యాంక్ గ్యారెంటీ ఉందని ఈ మేరకు మరమ్మతులు చేపడుతామన్నారు. వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, మేనేజర్ ఖాదర్‌మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలంకరణలో ప్రభుత్వ కార్యాలయాలు



గూడూరు/ బాలాయపల్లి/ వాకాడు/ కోట/ చిల్లకూరు/ వెంకటగిరి టౌన్, జూన్ 11: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో గూడూరు పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబయ్యాయి. సబ్‌కలెక్టర్ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలు విద్యుత్‌కాంతులతో శోభాయమానంగా మారాయి. బాలాయపల్లి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాను ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వాకాడు తహసీల్దారు, మండల పరిషత్, స్త్రీశక్తి భవనం, సెబ్ కార్యాలయం, అగ్రికల్చర్ కార్యాలయంలకు ప్రత్యేక విద్యుత్ అలంకరణదీపాలతో అలంకరణ చేపట్టారు. కోట మండలంలోని 16 సచివాలయాలు, పలు పురాతన ఆలయాలకు మంగళవారం ప్రభుత్వ అధికారులు సీరియల్ సెట్లు, పలు రకాల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గూడలిలోని పురాతన సంఘమేశ్వర ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చిల్లకూరు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలనూ విద్యుత్ దీపాలతో అలంకరించారు. వెంకటగిరి పట్టణం సహా మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఏపీఈఏపీ సెట్ ఫలితాలలో గూడూరు విద్యార్థి ప్రతిభ



దివ్యపూర్ణచంద్

గూడూరు, జూన్ 11: ఏపీఈఏపీ సెట్ పరీక్షా ఫలితాల్లో గూడూరుకు చెందిన పి.నాగకోటేశ్వరరావు, స్వాతి కుమారుడు దివ్యపూర్ణచంద్ రాష్ట్రస్థాయిలో 233వ ర్యాంకు సాధించాడు. టెన్త్ వరకు గూడూరులోని శ్రీచైతన్య పాఠశాలలో చదివిన పూర్ణచంద్ విజయవాడలో ఇంటర్మీడియేట్ చదివాడు. కాగా ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్సుడు పరీక్షా ఫలితాల్లో దివ్యపూర్ణచంద్ ఆల్‌ఇండియా 98వ ర్యాంకు సాధించాడు.

విధుల నిర్వహణపై దృష్టి సారించండి

కోట, జూన్ 11 : ప్రతి ఉద్యోగి విధుల నిర్వహణపై దృష్టి కేంద్రీకరించాలని ఎంపీడీవో శంకరయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై మంగళవారం పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీల్లో ఉద్యోగులందరూ అభివృద్ధిపై నివేదికలు తయారుచేయాలన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించేందుకు డిజిటల్ స్క్రీన్

నాయుడుపేట టౌన్, జూన్ 11: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని వీక్షించేందుకు డిజిటల్ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు కల్యాణి తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ భవనాన్ని మంగళవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు.

చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

కోట, జూన్ 11: మండలంలోని పలు ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడి పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ నాగబాబు మంగళవారం తెలిపారు. సూళ్లూరుపేట, నెల్లూరు, వక్రపాళెంకు చెందిన నిందితులను చిట్టేడు గురుకుల పాఠశాల అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోటరు సైకిల్ చోరీ

దొరవారిసత్రం, జూన్ 11: స్థానిక రైల్వేగేట్ వద్ద మంగళవారం సాయంత్రం మోటరు సైకిల్ అపహరణకు గురైంది. కొత్తపల్లికి చెందిన ఆదిశేషయ్య రైల్వేగేటు అండర్ బ్రిడ్జి వద్ద తన ఏపీ26ఎవి6435 నెంబరు గల బైకును పార్కింగ్ చేసి నేలపట్టుకు వెళ్లి వచ్చే లోగా అపహరించుకెళ్లారు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేపు మున్సిపల్ సమావేశం

వెంకటగిరి టౌన్, జూన్ 11: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ ఎస్.భానుప్రియ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రషీద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.







విజయవాడలో జరిగిన టీడీఎల్పీ సమావేశంలో లోకేశ్‌ను పలకరిస్తున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ - నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో లోకేశ్ కరచాలనం, పక్కనే వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

అమరావతికి తరలిన టీడీపీ నేతలు





పెళ్లకూరు, వెంకటగిరి పట్టణంనుంచి గన్నవరానికి వాహనాల్లో బయలు దేరుతున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, జూన్ 11: ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణస్వీకారం మహోత్సవానికి ఆ పార్టీ నేతలు అమరావతికి తరలి వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. ప్రమాణస్వీకార మహోత్సవం ప్రత్యక్షంగా వీక్షించేందుకు తామంతా బయలుదేరి వెళ్తున్నట్లు కృష్ణయ్య తెలిపారు. వెళ్లిన వారిలో తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, నాయకులు డి.ప్రసాద్‌నాయుడు, ఎస్.ప్రసాద్‌నాయుడు, సిద్దులయ్యనాయుడు, మోహన్‌నాయుడు, మునిరామయ్య, ఉదయ్‌నాయుడు తదితరులు ఉన్నారు.

దక్కిలి: సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార వేడుకలను నేరుగా చూసేందుకు డక్కిలి మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం తరలి వెళ్లారు. రాత్రి 8 గంటలకు నియోజకవర్గం నుంచి 4 ఆర్టీసీ బస్సులను సీఎం ప్రమాణ స్వీకారానికి వెళ్లే వారి కోసం ఏర్పాటు చేశారు.

తడ: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు బుధవారం ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున విజయవాడకు తరలి వెళ్లారు. తరలివెళ్లిన నాయకుల్లో బొమ్మన శ్రీధర్, సెల్వం, పళణి, రవి, నీలకంఠం, జీవ, జయపాల్ తదితరులు ఉన్నారు.

దొరవారిసత్రం: మండలం నుంచి సీఎం ప్రమాణ స్వీకారం మహోత్సవం తిలకించేందుకు టీడీపీ శ్రేణులు తరలి వెళ్లాయి. స్థానిక టీడీపీ నేత వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, అలాగే పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, కిషోర్‌నాయుడు, రవీంద్రనాయుడు, బాబునాయుడు, జకరయ్య తదితరులు కార్యకర్తలతో కలసి వెళ్లారు.

వెంకటగిరి: చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు పి.రాజేశ్వరరావు, వెంకటగిరి రూరల్ అధ్యక్షుడు పి.చంద్రమౌళిరెడ్డి, కె.శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

గూడూరు: గన్నవరంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో గూడూరు నియోజకవర్గం నుంచి పలువురు టీడీపీ నాయకులు వాహనాలల్లో మంగళవారం తరలివెళ్లారు. నియోజకవర్గ పరిధిలోని మండలాలకు చెందిన నాయకులు 4 బస్సులతో పాటు ఇతర వాహనాలలో తరలి వెళ్లారు.

వాకాడు: టీడీపీ మండల అధ్యక్షుడు డి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి డి.కృష్ణమూర్తి, తెలుగుయువత అధికార ప్రతినిధి కె. దయాకర్, తెలుగురైతు జిల్లా అధికార ప్రతినిధి టి.శ్రీనివాసులురెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బి. ప్రమీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారానికి ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. బీజేపీ గూడూరు నియో జకవర్గ కన్వీనర్ పి.పురుషోత్తమరెడ్డి, వి.సంపత్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు ఎస్.విజయశేఖర్‌రెడ్డి, ఎన్.సుధాకర్‌రెడ్డి ఏ.చంద్రయ్య, టి. రమణయ్య తదితరులు తరలివెళ్లారు.

చిల్లకూరు: మండల టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, మేగనూరు వెంకటకృష్ణయ్య, సతీష్‌యాదవ్, శివకుమార్, రమణయ్య తదితరుల ఆధ్వర్యంలో సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారానికి బస్సులో తరలివెళ్లారు.





చిల్లకూరు, వాకాడుల నుంచి బయలుదేరుతున్న టీడీపీ నాయకులు